# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ఆగస్టు 31 వుదయం ప్రతినిధి**

ప్రజల సమస్యల పరిష్కార వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, డీపీఓ 7, మున్సిపాలిటీ 5, డీఎంహెచ్ఓ 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని, మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని కలెక్టర్ ఈ



సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, సీపీఓ కిషన్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

## అంకితభావం, నిబద్ధత కలిగిన ఉత్తమ ఉపాధ్యాయుడు ఆర్.బి. శ్రీనివాసరావు



**పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు**

**మధిర, ఆగస్టు 31, వుదయం ప్రతినిధి:**

మధిర మండలం మాటూరు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా 37 సంవత్సరాల పాటు సేవలందించిన ఆర్.భాగ్య శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికిప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీహరి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు మాట్లాడుతూ ఆర్.బి. శ్రీనివాసరావు తన 37 ఏళ్ల ఉపాధ్యాయ సేవల్లో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా, మంచి చిత్రకారుడిగా తాను పనిచేసిన గ్రామాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దల మన్ననలు పొందారని తెలిపారు.వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన శ్రీనివాసరావు సేవలు అభినందనీయమన్నారు. పిఆర్ టియు జిల్లా, మధిర మండల శాఖల తరపున ఆయనకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్. బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు సిహెచ్ వి రవికుమార్, మధిర మండల ప్రధాన కార్యదర్శి పోలె సుధాకర్, మాజీ రాష్ట్ర బాధ్యులు ఎస్.కె మదార్, సీనియర్ నాయకులు బూసా కోటేశ్వరరావు, కొలగాని ప్రసాదరావు, పురం సంగారావు, సాయి కృష్ణమాచార్యులు, వేము రాములు,ప్రసాదరావు, సత్యావతి, ప్రసూన, సునీత, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## శిరీషకు న్యాయం చేయాలి.. భౌతికకాయానికి బీజేపీ నాయకుల ఘన నివాళులు

- **దోషులకు కఠిన శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తాం**
- **కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి**

**చౌటిగూడెం,31/8/26 వుదయం ప్రతినిధి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకే శిరీష భౌతికకాయాన్ని ఆదివారం బీజేపీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. శిరీష మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేసిన నాయకులు, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ నాయకులు వారి కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్టకాలంలో వారికి ధైర్యంగా నిలబడాలని సూచించారు. శిరీష కుటుంబం న్యాయం కోసం చేసే పోరాటంలో బీజేపీ నాయకులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని స్పష్టం చేశారు.

శిరీష మృతికి కారణమైన నిందితుడిగా పేర్కొంటున్న శానాద్ ఉల్లాఖాన్‌తో పాటు, ఈ ఘటనకు సంబంధించి మరెవరైనా వ్యక్తుల ప్రమేయం ఉందా అనే అంశంపై కూడా సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఘటన వెనుక ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, నిజానిజాలను వెలికితీయాలని కోరారు. ఎలాంటి రాజకీయ, ఆర్థిక లేదా ఇతర ప్రభావాలకు తలొగ్గకుండా దర్యాప్తును పారదర్శకంగా నిర్వహించి, ఈ ఘటనకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, సందర్శకుల వివరాల నమోదు వంటి చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, పోడియం బాలరాజు, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, రాష్ట్ర కమిటీ సభ్యులు తంబళ్ల రవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు స్వాతి, ములకలపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొని ఊకే శిరీష భౌతికకాయానికి నివాళులర్పించారు.



## బాలాజీనగర్‌లో మడేలయ్య, సీతాలమ్మ, ఈదెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

**కోదాడ ఆగస్టు 31(వుదయం)**

కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్వహించిన మడేలయ్య, సీతాలమ్మ, ఈదెమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై నిర్వాహకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యారంగానికి పొందూరి వరలక్ష్మి రామారావు సేవలు ప్రశంసనీయం

- **మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో సేవలు**
- **మహిళా చైతన్యానికి నిదర్శనం:**

**ఎర్నేని వెంకటరత్నం బాబు, ఎంఈఓ సలీం షరీఫ్**

**కోదాడ ఆగస్టు 31(వుదయం)**



కోదాడ: విద్యారంగానికి పొందూరి వరలక్ష్మి రామారావు అందించిన సేవలు ప్రశంసనీయమని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. సోమవారం కోదాడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పొందూరి వరలక్ష్మి రామారావు అభినందన సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ కోదాడ మండలంలోని పలు పాఠశాలల్లో వరలక్ష్మి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. మహిళల్లో అక్షరాస్యత, ఉన్నత విద్యపై అవగాహన తక్కువగా ఉన్న రోజుల్లోనే ఉన్నత విద్యను అభ్యసించి, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించి ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బానోతు సుశీల భాయ్ మాట్లాడుతూ.. వరలక్ష్మి క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ వృత్తి ధర్మాన్ని అంకితభావంతో నిర్వహించారని అన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉపాధ్యాయురాలిగా మంచి పేరు సంపాదించారని తెలిపారు. రిటైర్డ్ గెజిటెడ్ హెచ్ఎం ముత్తవరపు రామారావు, పొందూరి వరలక్ష్మి దంపతులను అతిథులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు మన్యం సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ గంధ్ల వీరభద్రం, ఎర్రవరం సొసైటీ చైర్మన్ నల్లజాల శ్రీను, టీపీటీఎఫ్ నాయకులు బదుగుల సైదులు, రామ నరసయ్య, హనుమంతరావు, అడ్వకేట్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, వేమరి విద్యాసాగర్, ఉపాధ్యాయులు మంగమ్మ, స్వరూప, వర్మ తదితరులు పాల్గొని వరలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు.

## మున్నూరు కాపు పట్టణ మండల నూతన కమిటీల ఎన్నిక

**మధిర, ఆగస్టు 31, వుదయం ప్రతినిధి:**



మధిర మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయం రోడ్డులో గల మున్నూరు కాపు సంఘ కార్యాలయంలో మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం మరియు నూతన కమిటీల ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధిర నియోజకవర్గ మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ అధ్యక్షతన,జిల్లా మరియు నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల సమక్షంలో నూతన కమిటీల ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు.ఈ సందర్భంగా ఒకే వేదికపై నాలుగు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం.మధిర టౌన్ కమిటీ, మధిర మండల కమిటీ, మధిర టౌన్ మహిళా కమిటీ, మధిర మండల మహిళా కమిటీ లను సభ్యులందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వెంటనే నూతన కమిటీ సభ్యులకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ మాట్లాడుతూ ముందుగా మధిర మండల అధ్యక్షునిగా రంగశెట్టి చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది తదుపరి మున్నూరు కాపు సంఘం రాష్ట్రంలోనే ఎంతో చరిత్ర, బలం కలిగిన సంఘమని అన్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అధ్యక్షుల సూచనల మేరకు సంఘ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు,పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి కృష్ణ 19వ వార్డ్ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు రామిశెట్టి నాగేశ్వరావు వీరంశెట్టి సీతారామయ్య జున్ను సుదర్శన్ చెన్నం స్వామి చిన్నం వెంకటేశ్వర్లు సిద్ధా కృష్ణ పాలెపు వెంకటేశ్వర్లు రామిశెట్టి శ్రీనివాసరావు ఇల్లూరి నవీన్ పగడాల శివ ఉప్పాల పద్మ,మండల కమిటీ సభ్యులు మండల అధ్యక్షులు రంగశెట్టి చిరంజీవి ఉపాధ్యక్షులు యక్కటీల కృష్ణారావు ఎద్ల సాంబయ్య సాగి పెద్ద కనకారావు శాఖమూడి గోపీనాథ్ ప్రధాన కార్యదర్శులు దేవిశెట్టి భాస్కరరావు లంకే మల్ల నాగేశ్వరరావు కోశాధికారులు పోసేపల్లి శంకర్రావు నాయిని జగదీష్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రమేష్ మత్తి నాగేశ్వరావు సహాయ కార్యదర్శి గంటా నాగేశ్వరావు దారా రామారావు నెల్లూరు విజయరాజు నెల్లూరు అఖిల్ కార్యవర్గ సభ్యులు కంచర్ల రమణ రావూరి పుల్లయ్య గోనే నాగేశ్వరావు రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## వినియోగదారుల రక్షణ చట్టం - 2019 పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కు వినతి

**యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో వినియోగదారుల రక్షణ చట్టం – 2019 ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షులు పోచం సోమయ్య కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కంజ్యూమర్ ప్రొటెక్షన్ సెల్, వినియోగదారుల విజిలెన్స్ కమిటీ లను ఏర్పాటు చేయాలని కోరారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో నాణ్యత లేని వస్తువులు, ప్యాకింగ్ తినుబండారాలు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధి కొడారి వెంకటేష్ పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న మధిర ఆర్టీసీ డిపో సిబ్బంది

**మధిర, ఆగస్టు 31, వుదయం ప్రతినిధి:**



మధిర ఆర్టీసీ డిపో సిబ్బంది మరోసారి నిజాయితీని చాటుకున్నారు. ఆగస్టు 30న మధిర డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు మధిర నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా, ఓ ప్రయాణికుడు తన మొబైల్ ఫోన్‌ను సీటులోనే మర్చిపోయి ఎల్బీనగర్‌లో బస్సు దిగిపోయాడు.తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇనపనూరి మధు ఖమ్మం నుంచి ఎల్బీనగర్‌కు ప్రయాణిస్తూ తన మొబైల్ ఫోన్‌ను బస్సులో మర్చిపోయారు. బస్సు హైదరాబాద్‌లోని బస్టాండ్‌కు చేరుకున్న అనంతరం కండక్టర్ ఎస్కే. నాగుల్ మీరా డ్రైవర్ శ్రీకాంత్ మొబైల్ ఫోన్‌ను గుర్తించారు.మొబైల్‌లోని నంబర్ల ద్వారా సదరు ప్రయాణికుడికి సమాచారం అందించి, హైదరాబాద్ బస్‌స్టేషన్ మేనేజర్ సమక్షంలో సుమారు రూ.25 వేల విలువైన మొబైల్ ఫోన్‌ను మధుకు సురక్షితంగా అప్పగించారు.తన విలువైన మొబైల్‌ను తిరిగి అందించిన కండక్టర్, డ్రైవర్‌తో పాటు మధిర డిపో మేనేజర్ టి. దేవరాజు, డిపో సిబ్బందికి ప్రయాణికుడు మధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ, బాధ్యతాయుతమైన సేవలను పలువురు అభినందించారు.

## శక్తి స్కీమ్ రద్దు చేయాలని సీఎం రేవంత్ కు పోస్ట్ కార్డులు

**పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి పోస్ట్ కార్డులు పంపిన బీఆర్ఎస్వీ నాయకులు**

**సూర్యాపేట ఆగస్టు 31: వుదయం ప్రతినిధి**




శక్తి స్కీమ్ (జీఓ నం.97) ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్వీ (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) నాయకులు పోస్ట్ కార్డుల ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు బంటు సందీప్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న శక్తి స్కీమ్ (జీఓ నం.97) ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డుల ద్వారా తమ నిరసన తెలియజేశామన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులతో కలిసి తమ సమస్యలను పోస్ట్ కార్డుల ద్వారా ముఖ్యమంత్రికి తెలియజేశామని, శక్తి స్కీమ్ వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల విద్య, భవిష్యత్ అవకాశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు విద్యార్థుల తరపున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఖమ్మంపాటి ఉదయ్, పడిదల నవనీత్, బొల్లం వినయ్, ఎలాగబోయిన వంశీ, సాయి, చమకూరి మహేందర్, వెంకట్, అభి తదితరులు పాల్గొన్నారు.




## సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా బాధ్యతల స్వీకరణ

**సత్తుపల్లి ఆగస్టు 31 (వుదయం ప్రతి నిధి )**

అసెంబ్లీ లైబ్రరీ అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్ గా నియమితులైన సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్పీకర్ గడ్డం ప్రసాదు సెక్రటరీ రెడ్ల తిరుపతి, అడిషనల్ సెక్రటరీ ఉపేందర్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు బాధ్యతలు అప్పజెప్పారు , ఈ నేపథ్యంలో అసెంబ్లీ లైబ్రరీ సిబ్బందితో సహా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వక్కలగడ్డ చంద్రశేఖర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే లైబ్రరీని సందర్శించి అందులో ని ఉన్న పుస్తకాలు, తదితర సౌకర్యాలు పరిశీలించారు. అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

## కోదాడలో కుల రాజకీయాలకు తావులేదు

- **అభివృద్ధి రాజకీయాలే తెలుసు.. కుల రాజకీయాలు తెలియవు**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు**
- **మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ**

**కోదాడ ఆగస్టు 31(వుదయం)**



కోదాడ: కోదాడలో కుల రాజకీయాలకు తావులేదని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి రాజకీయాలే కొనసాగుతున్నాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ అన్నారు. సోమవారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత నాలుగు రోజులుగా కోదాడలో జరుగుతున్న డబ్బా కొట్టు వ్యవహారంలో వాస్తవాలను తెలుసుకోకుండా కొంతమంది రాజకీయ నాయకులు కులం రంగు పులుముతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా, అభివృద్ధి పరంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఎదుర్కోలేకనే వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. మంత్రి, ఎమ్మెల్యేలపై వ్యక్తిగతంగా నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని, తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని తిరుపతమ్మ హెచ్చరించారు. "ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉత్తమ్ పద్మావతి రెడ్డికి కుల రాజకీయాలు తెలియవు.. అభివృద్ధి రాజకీయాలే తెలుసు" అని అన్నారు. 32 ఏళ్లుగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ప్రజలకు, గ్రామాలకు మేలు చేసే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఏ ఒక్క కులం కోసం కాకుండా అన్ని వర్గాలు, విద్యార్థులు, భావితరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త ఆసుపత్రి, బస్టాండ్, కోర్టు భవనం, ఇంటిగ్రేటెడ్ స్కూల్, నవోదయ పాఠశాల, రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, అంగన్వాడీ భవనాలు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా శక్తి భవనాలు, లిఫ్ట్ ఇరిగేషన్, ఎత్తిపోతల పథకాలు, పంట కాలువలు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు భారీగా నిధులు తీసుకొస్తున్నారని ఆమె వివరించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలపై కులం రంగు పులమడం తగదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్, డైరెక్టర్లు తమనబోయిన వీరబాబు, చింతలకుంట్ల సూర్యం, యాదవ్ మల్లు వెంకట రెడ్డి, కునుకుట్ల శ్రీనివాస్, రేపని శ్రీను, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కోసం సర్పంచ్‌లు ఎదురుచూపులు



**అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని ఆవేదన**

**చర్ల, ఆగస్టు 31: (వుదయం ప్రతినిధి)**

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు పంచాయతీలకు సంబంధించిన ఖాతాల్లో నిధులు జమ కాకపోవడంతో సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర అత్యవసర పనులకు నిధులు లేకపోవడంతో గతంలో సొంత డబ్బులు ఖర్చు చేయడంతో పాటు వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు నిర్వహించాల్సి వచ్చిందని సర్పంచులు పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు చెబుతున్నా, పంచాయతీ ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో అప్పులు చేసిన సర్పంచులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిధులు ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతాయో తెలియక ఆందోళన చెందుతున్నామని అన్నారు. ఈ సమస్యపై సోమవారం చర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్యకు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, వివిధ గ్రామాల సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేసి, సర్పంచుల ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో పూజారి సామ్రాజ్యం సోయం నాగలక్ష్మి, కాపుల శారద, తుర్రం రవికుమార్, లక్ష్మణ్, మురళి,కమల, సీత, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## నీటి విడుదలతో రైతుల్లో ఆనందం

**కొత్తగూడెం మేజర్ కాలువకు జలకళ**

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు**

**అనంతగిరి ఆగస్టు 31 వుదయం**

మండల పరిధిలోని కొత్తగూడెం మేజర్ కాలువకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో కాలువకు నీటి విడుదల జరగడంతో రైతులు మరియు ముత్తినేని కోటేశ్వరరావు హర్ష వ్యక్తం చేశారు.కాలువకు నీరు చేరడంతో సాగు పనులకు ఊతం లభించడంతో పాటు పంటలకు సాగునీటి భరోసా కలిగిందని రైతులు తెలిపారు.

తమ సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్తగూడెం మేజర్ కాలువకు నీటిని విడుదల చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రైతులు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాలువలో పారుతున్న జలాలతో రైతుల ముఖాల్లో ఆనందం.. సాగుపై కొత్త ఆశలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి, వుదయం ప్రతినిధి**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 74 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 47, సర్వే ల్యాండ్స్ 5, ఉపాధి కల్పన 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ 2, మున్సిపాలిటీ 2, ఎంపీడీవో లు 2, బీసీ వెల్ఫేర్ 2, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, సంక్షేమ, ఉద్యానవన, ఎల్.డి.యం , చేనేత మరియు జౌళి, మార్కెటింగ్, కోపరేటివ్, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృతిక, సాత్విక్, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## హెడ్‌మాస్టర్ సాయి బాబాకు సన్మానం

**తిమ్మాజిపేట, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని మరికల్ గ్రామంలో హెడ్‌మాస్టర్ సాయి బాబా ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి బాబాను సన్మానించి, విద్యార్థులకు ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో విద్యాబోధన చేసిన ఆయన సేవలను అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుక వివేక్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత విలేకరి పై దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**దళిత విలేఖరి అక్రిడేషన్ కార్డును ఆపడం సరైనది కాదు**

**కేవీపీఎస్ డిమాండ్**

**సంగారెడ్డి వుదయం**



దళిత విలేకరి రాములు పై ఆకారణంగా దాడి చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి చట్టపరమైన చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలనీ కోరుతూ బాధితుడు రాములుతో కలిసి జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఎ. మాణిక్, జిల్లా కార్యదర్శి పి. అశోక్ మాట్లాడుతు జిల్లాలోని పత్రికలో నారాయణ ఖేడ్ నియోజకవర్గం ఇంచార్జి గా దండు రాములు పనిచేస్తు ప్రజా సమస్యలు వెలికి తీసేవారని మార్చి 17న మనూరు మండలం అతిమ్యల గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని అనుమతితో పాఠశాలలో జరుగుతున్న మంచి విషయాలను తమ పత్రికలో రాయడానికి వెళ్లిన రాములు పై అదే పాఠశాలలో పని చేస్తున్న మహేష్ కుమార్ అనే ఉపాధ్యాయుడు దాడి చేశాడని ఆయన దాడి చేయడంతో పాటు గ్రామ పంచాయతీలోకి తీసుకెళ్లి కులం పేరుతో దూషిస్తూ నువ్వు విలేకరివ అంటూ అవమానిస్తూ కొట్టారని దళిత విలేఖరి పై కులం పేరుతో దూషిస్తూ అవమానపరిచి కొట్టిన ఉపాధ్యాయుడు మహేష్ కుమార్ పై ఇప్పటివరకు చట్టపరమైన చర్యలు తీసుకోలేదని సమగ్రమైన విచారణ జరిపి దళిత విలేఖరి దండు రాములు పై దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని దళితుడు రాములు పై ఎఫ్ ఐ ఆర్ ఉందానే పేరుతో అక్రిడేషన్ కార్డు ఆపారని కానీ అగ్రకుల ఉపాధ్యాయుడు పై కూడా ఎఫ్ఐఆర్ నమోదైన ఆయన మాత్రం మాత్రం యధావిధిగా తన ఉద్యోగం చేసుకుంటున్నాడని దళిత విలేఖరి వర్తించే నిబంధనలు అగ్రకుల ఉపాధ్యాయుడికి వర్తించవా అని ప్రశ్నించారు దళిత విలేకరి దండురాములు కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు అనిల్ బుద్ధ, కెవిపిఎస్ జిల్లా నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా, వైద్య సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



**నాగర్‌కర్నూల్ రూరల్ , ఆగస్టు 31, (వుదయం ప్రతినిధ:**

విద్యా, వైద్య రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చనకు వినతిపత్రం అందజేశారు.విద్య, వైద్య రంగాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదిల రామయ్య, మండల కమిటీ సభ్యుడు మధు, నాయకులు సత్యనారాయణ, కాశన్న పాల్గొన్నారు.



## పోలీస్ ప్రజావాణికి 8 ఫిర్యాదులు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 31 (వుదయం బ్యూరో):**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణి కార్యక్రమానికి ఎనిమిది ఫిర్యాదులు అందాయి. ఎస్పీ డాక్టర్. సంగ్రామ్‌సింగ్ జి. పాటిల్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదుల్లో భూ వివాదాలకు సంబంధించి నాలుగు, న్యాయపరమైన అంశాలపై మూడు, భార్యాభర్తల మధ్య వివాదానికి సంబంధించి ఒక ఫిర్యాదు ఉన్నాయి. ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, సమస్యలను చట్టపరిధిలో సమగ్రంగా విచారించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.

## ఆపద్బాంధవుడిగా నిలిచిన 'జై భీమ్ యూత్'

**అనాథలైన సునీత, నవనీతలకు 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ**

**సిద్దిపేట/జగదేవపూర్, (వుదయం ప్రతినిధి)**



తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఆ నిరుపేద అక్కాచెల్లెళ్లకు 'జై భీమ్ యూత్' సభ్యులు మేమున్నామంటూ ఆర్థిక సాయం అందించి పెద్ద దిక్కుగా నిలిచారు. సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కొలిపాక మల్లయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇప్పటికే తల్లిని కోల్పోయి, ఇప్పుడు తండ్రి కూడా కన్నుమూయడంతో ఆయన కూతుళ్లు సునీత, నవనీత పూర్తిగా అనాథలుగా మారారు. తీవ్ర దుఃఖంలో ఉన్న ఆ నిరుపేద అక్కాచెల్లెళ్ల పరిస్థితిని తెలుసుకున్న దౌలాపూర్ 'జై భీమ్ యూత్' సభ్యులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యం చెప్పి, తమ వంతు బాధ్యతగా 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.తల్లిదండ్రులు లేక అనాథలుగా మిగిలిన ఆ బాలికలకు గ్రామంలో ఎవరు లేరనే దిగులు వద్దని, జై భీమ్ యూత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దౌలాపూర్ లోని నిరుపేద కుటుంబాలకి, కష్టాల్లో ఉన్నవారికి తమ యూత్ ఎప్పుడూ ముందుండి సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశపురం రాజు, ముక్కెర పవన్, తిరుమలపురం తిరుపతి, ముక్కెర గిరి, ముక్కెర విక్రమ్, ఆకారం బంగారి, మాస్కురి శ్రీకాంత్ మరియు ఇతర యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విధ్వంస పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

**సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు**

**పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి వుదయం:**



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు సిద్ధమైంది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 'కాంగ్రెస్ 1000 రోజుల పాలన - 420 మోసాలు' పేరుతో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపట్టనున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాలపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడు రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల నిర్వహణపై నాయకుల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఏడు రోజుల కార్యక్రమాల కార్యాచరణను నాయకులకు వివరించారు.

**ప్రజల తరఫున పోరాడే సమయం ఆసన్నమైంది: చింతా ప్రభాకర్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విధ్వంసక పాలనపై ప్రజల తరఫున పోరాడే సమయం ఆసన్నమైంది. అరచేతిలో వైకుంఠం చూపించినట్లు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది" అని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగించడంతో పాటు అదనంగా మరిన్ని ప్రయోజనాలు అందిస్తామని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఏడు రోజుల కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ' బాకీ కార్డులు ' రూపంలో కాంగ్రెస్ హామీలను ప్రతి గడపగడపకు చేరవేయాలని పిలుపునిచ్చారు.

" రానున్నది మన ప్రభుత్వమే. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, కేసీఆర్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో ఉన్న లోటుపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోవాలి" అని చింతా ప్రభాకర్ అన్నారు.ఆరోగ్యం సహకరించకపోయినా తన గెలుపు కోసం పార్టీ అభ్యర్థులను గెలిపించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు." నేను ఉద్దేశపూర్వకంగా ఎవరికీ పొరపాటు చేయాలని, ఎవరికైనా నష్టం లేదా కష్టం కలిగించాలని భావించే వ్యక్తిని కాదు. క్షేత్రస్థాయి నుంచి రాజకీయాల్లో, జీవితంలో పైకి వచ్చిన వ్యక్తిని. జీవితంలో నేను ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నానో నాకు తెలుసు. అలాంటి అవమానాలు ఎవరికీ జరగకూడదని నేను భావిస్తాను" అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు.

**బాకీ కార్డులను గడపగడపకు చేర్చాలి: చంద్ర గౌడ్**

నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' ప్రతి గడపగడపకు అందించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. అదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా, అందరి భాగస్వామ్యంతో వారం రోజుల పాటు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని వర్గాల ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, ఏడు రోజుల కార్యక్రమాల నిర్వహణలో సంగారెడ్డి జిల్లా ఆదర్శంగా నిలవాలని చంద్ర గౌడ్ అన్నారు.

బీఆర్ఎస్ ఏడు రోజుల నిరసన కార్యక్రమాల వివరాలు

సెప్టెంబర్ 2:తెలంగాణ భవన్‌లో లోగో ఆవిష్కరణ, ఏడు రోజుల కార్యక్రమాల ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు ప్రెస్‌మీట్. నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధర్నాలు, బాకీ కార్డుల పంపిణీ, 420 ఫీట్ల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నారు.

సెప్టెంబర్ 3:
వ్యవసాయ రంగ విధ్వంసం, నీటిపారుదల, విద్యుత్, యూరియా, రైతు బీమా తదితర అంశాలపై రైతు సదస్సులు నిర్వహించనున్నారు.

సెప్టెంబర్ 4:
వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సులు నిర్వహిస్తారు. మహిళలకు రూ.2,500, కేసీఆర్ కిట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం తదితర హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నారు.

సెప్టెంబర్ 5:
విద్యార్థులు, యువతకు సంబంధించిన సమస్యలపై కార్యక్రమాలు చేపడతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ తదితర హామీల అమలును కోరుతూ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు స్కూటీలు ఇవ్వాలన్న హామీని కూడా ఈ కార్యక్రమాల్లో ప్రస్తావించనున్నారు.

సెప్టెంబర్ 6:
పల్లెల విధ్వంసం, పట్టణాలు-గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, పట్టించుకోని పారిశుద్ధ్య పరిస్థితులకు నిరసనగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సెప్టెంబర్ 7:
జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నారు.

సెప్టెంబర్ 8:
జిల్లా కేంద్రంలో ఏడు రోజుల కార్యక్రమాలపై ప్రెస్‌మీట్ నిర్వహించి, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించనున్నారు.

సెప్టెంబర్ 10:
ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించనున్నారు.

ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, సీనియర్ నాయకులు హకీమ్, డాక్టర్ శ్రీహరి, మాజీ జడ్పీటీసీలు మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలి

**- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్**

**సిద్దిపేట, ఆగస్టు 31 (వుదయం):**



మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రీడా రంగంలో రాణించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ భారత హాకీ రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం నేటి యువతకు ఆదర్శమన్నారు.మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత క్రీడల్లో ప్రతిభను చాటుతూ దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బందికి వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్టీసీకి శేఖర్ గౌడ్ అందించిన సేవలు అభినందనీయం

**నారాయణపేట ఆర్టిసి డిఎం రామ్మోహన్**

**నారాయణపేట ఆగస్టు31(వుదయం ప్రతినిధి)**



నారాయణపేట ఆర్టీసీ డిపోలో కంట్రోలర్ శేఖర్ గౌడ్ అందించిన సేవలు అభినందనీయమని డిఎం రామ్మోహన్ అన్నారు. కంట్రోలర్ శేఖర్ గౌడ్ పదవి విరమణ సందర్భంగా డిపో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎం మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అంకితభావంతో అందించే సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఆయన అన్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సుదీర్ఘ ప్రభుత్వ సేవను పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న శేఖర్ గౌడ్ సేవలు అభినందనీయం అన్నారు. డిపోలో అవసరమైన సేవలను అందిస్తూ, తోటి సిబ్బంది సమస్యలను పరిష్కరించినప్పుడు కలిగే సంతృప్తి ప్రయోజనాలు వేగంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో కలసి పనిచేశారని గుర్తు చేశారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని డిఎం ఆకాంక్షించారు. పదవి విరమణ పొందిన శేఖర్ గౌడ్ కు డిఎం తోపాటు సిబ్బంది ఆర్టీసీ కార్మికులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## ఓటరు జాబితా సవరణపై బీఎల్‌ఓలకు అవగాహన సద్దస్సు

**కోహిర్, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి ):**



కోహిర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎల్ఓ సూపర్వైజర్ ధనరాజ్ పాల్గొన్నారు.భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - సర్ ) కార్యక్రమంపై బీఎల్ఓలకు సమావేశంలో సమగ్ర అవగాహన కల్పించారు. తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా నకిలీ, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న, సాధారణ నివాసం ఉన్న ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు.

ప్రజలకు అవసరమైన పత్రాలు, ఓటరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బీఎల్ఓలకు సహకరించి తమ ఓటరు వివరాలను ఒకసారి సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సవరణలు చేసుకునేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## రెండు రోజుల్లో ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ పూర్తి చేయాలి

**క్షేత్రస్థాయిలో తహసిల్దారులు, ఎంపీడీవోలు పర్యటించాలి**

**విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, ఆగస్టు 31 (వుదయం కరస్పాండెంట్)**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, వివిధ మండలాల అధికారులతో వెబ్ఎక్స్ సమావేశం నిర్వహించిన కలెక్టర్.. నోటీసుల పంపిణీ, ఓటర్ల హియరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.

తహసిల్దారులు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు పత్రాన్ని సంబంధిత ఓటర్లు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

**అంగన్‌వాడీ టీచర్లకు స్పష్టమైన ఆదేశాలు**

బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని ఓటర్లకు నోటీసులు అందించడంలో అలసత్వం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళా సంక్షేమ శాఖ అధికారులు బీఎల్‌వోలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించి, నోటీసుల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

సెప్టెంబర్ 1 నుంచి ప్రతిరోజూ ఎంత మంది బీఎల్‌వోలు విధుల్లో పాల్గొంటున్నారనే వివరాలతో రోజువారీ నివేదికను పంపించాలని అధికారులను ఆదేశించారు. నోటీసుల పంపిణీతో పాటు తదుపరి హియరింగ్ ప్రక్రియను కూడా నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

**దౌల్తాబాద్, ఆగస్టు 31 (వుదయం):**

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఇందుప్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు హిందీ, జీవశాస్త్ర అంశాలపై కాంప్లెక్స్ సముదాయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మాట్లాడుతూ.. మాతృభాషతో పాటు ద్వితీయ భాషగా హిందీని విద్యార్థులు ధారాళంగా చదవడం, మాట్లాడడం నేర్చుకునేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను విశ్లేషించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని సూచించారు.

జీవశాస్త్ర బోధనలో జీవుల మనుగడ, వాటి జీవన దశలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని తెలిపారు. నిత్యజీవితంలో విద్యార్థులు ఎదుర్కొనే అనుభవాలను పాఠ్యాంశాలతో అనుసంధానం చేస్తూ బోధిస్తే విషయ పరిజ్ఞానం మరింత సులభంగా అర్థమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇందుప్రియాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు షకీల్ పాషా, రిసోర్స్ పర్సన్‌లు భూపతిరెడ్డి, విజయ్‌కృష్ణతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ అండర్–17 క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



**ఐజ మండల స్థాయి పోటీల్లో విజేతలుగా పలు పాఠశాలలు**

**ఐజ, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) ఆధ్వర్యంలో ఐజ మండల స్థాయిలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు.

ఖోఖో బాలికల విభాగంలో మెడికొండ జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతగా నిలవగా, ఐజ కృష్ణవేణి పాఠశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో ఐజ బ్రైట్ స్టార్ హైస్కూల్ విజేతగా, ఐజ బీజీఆర్ హైస్కూల్ రన్నరప్‌గా నిలిచాయి.కబడ్డీ బాలికల విభాగంలో మెడికొండ జెడ్పీహెచ్ఎస్ జట్టు ప్రథమ స్థానాన్ని సాధించగా, ఐజ కేజీబీవీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీ బాలుర విభాగంలో మెడికొండ జెడ్పీహెచ్ఎస్ విజేతగా, ఐజ కృష్ణవేణి హైస్కూల్ రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్ బాలికల విభాగంలో ఉత్తనూరు జెడ్పీహెచ్ఎస్ విజేతగా, ఐజ కేజీబీవీ రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ బాలుర విభాగంలో ఉప్పల జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతగా, ఐజ కృష్ణవేణి హైస్కూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈకార్యక్రమానికి మెడికొండ సర్పంచ్ లైజమ్మ, ఉప్పల సర్పంచ్ రాధా తిమ్మప్ప, హెచ్‌ఎం పీ. తిమ్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పీఈటీలు జగదీశ్, సతీష్, సుబ్బన్న, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వారు పేర్కొన్నారు.

## సర్పంచ్ ను పరామర్శించిన రాజేశ్వర్ రెడ్డి

**ఆరోగ్య పరిస్థితి ఆరా**

**- మెరుగైన వైద్యం అందించాలని సూచన**

**- అధైర్యపడొద్దు నేనున్నానని సత్యం కుటుంబానికి భరోసా కల్పించిన విఅర్అర్**

**నంగునూరు, ఆగస్టు 31 (వుదయం):**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయచెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యంకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి సత్యంను పరామర్శించారు.వైద్యులను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. సత్యం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే తన బాధ్యతగా భావిస్తానని పేర్కొన్న ఆయన, కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

## 42 ఏళ్ల ఫైర్ సేవలకు ఘన సన్మానం



**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 31, (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ ఫైర్ సర్వీసెస్‌లో 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన నాగర్‌కర్నూల్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఐ. కృష్ణమూర్తిని పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ తీగల సునేంద్రకుమార్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో కృష్ణమూర్తి అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఫైర్ సర్వీసెస్‌కు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాదం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ, ఏటీసీలో దరఖాస్తుల స్వీకరణ

**ప్రిన్సిపాల్ ఎన్. రామానుజ**

*** ముగింపు తేదీ: సెప్టెంబరు 5 వరకు దరఖాస్తుకు అవకాశం**

*** అర్హత: వయోపరిమితి లేదు; పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు**

**సిద్దిపేట, ఆగస్టు 31 (వుదయం బ్యూరో)**

సిద్దిపేట జిల్లా ఇర్కోడ్ గ్రామంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ), ఉన్నత సాంకేతిక కేంద్రం (ఏటీసీ) నందు 202627 విద్యా సంవత్సరానికి గాను స్పాట్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని సంస్థ ప్రాచార్యులు ఎన్. అభ్యర్థులు www.iti.telangana.gov.in అంతర్జాల వేదిక ద్వారా సెప్టెంబరు 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఐటీఐ, ఏటీసీలలో ఫిట్టర్, డీజిల్ మెకానిక్‌లతో పాటు మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ (MPCA), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, అడ్వాన్స్డ్ సి.ఎన్.సి. మిషనింగ్ టెక్నీషియన్ , బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ వంటి ఆధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ధ్రువీకరణ పత్రాలు (పదో తరగతి మెమో, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ, ఇమెయిల్, ఫోటో, ఫోన్ నంబర్) కలిగిన అభ్యర్థులు సెప్టెంబరు 1 నుండి 5 వరకు ప్రతిరోజు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల మధ్య ఇర్కోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ నందు నేరుగా హాజరై ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం




**అదనపు ఎస్పీ చేతన్ నితిన్**

**జగిత్యాల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు అంకిత భావంతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సన్మానించారు అనంతరం అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అన్నారు ఉద్యోగ జీవితమంతా ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన అధికారుల సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమేనని జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు రిటైర్ అవుతున్న అధికారులు తమ అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అధికారులు జమీల్ అహ్మద్ (ఎస్ఐ) సీహెచ్. శ్రీనివాస్ (ఏఎస్ఐ) ఆర్ కృష్ణకుమార్ (ఏఎస్ఐ) ఏ శ్రీనివాస్ (హెడ్ కానిస్టేబుల్) పీ రాజయ్య (హెడ్ కానిస్టేబుల్) లను అదనపు ఎస్పీ శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను అభినందించారు అలాగే వారి కుటుంబ సభ్యులకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగ కాలంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఉద్యోగ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేసిన ప్రతి రోజు తమ జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు తమ సేవా కాలంలో సహకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సహోద్యోగులు సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు పోలీసు శాఖలో పని చేసే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని భవిష్యత్తులో కూడా సమాజానికి తమవంతు సేవలు అందిస్తామన్నారు అనంతరం పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో వీడ్కోలు పలికారు ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ పోలీస్ సిబ్బంది రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత**

**జగిత్యాల, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజగౌడ్ జిల్లా రెవెన్యూ అధికారి కె వై ప్రసాద్ లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు

కాగా తేది 31 8 2026 నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రజా భవన్ (హైదరాబాద్) ముఖ్య మంత్రి ప్రజావాణి జగిత్యాల జిల్లా ప్రజావాణికి సంబంధించి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వచ్చే ప్రజావాణి వరకు పరిష్కరించాలని లేని యెడల దరఖాస్తుదారులకు తగిన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు అనంతరం నేత్రదానం శ్రేష్ఠ దానం కార్యక్రమంలో భాగంగా 41వ నేత్రదాన పక్షోత్సవాలు ఆగష్టు 25 నుండి సెప్టెంబర్ 25 వరకు నిర్వహించబడునని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం జిల్లా పరిపాలన యంత్రాంగం తరపున నేత్రదానాన్ని ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలని మరణానంతరం మన నేత్రాలను దానం చేయడం ద్వారా చూపులేని ఇద్దరు వ్యక్తులు జీవితంలో వెలుగును నింపవచ్చని ఇది మనిషి చేయగల అత్యంత గొప్పదనం ఒకటి అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ ప్రగతికి పెద్దపీట




- **32 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం**
- **రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు**
- **పార్టీలకు అతీతంగా అభివృద్ధి.. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**వేములవాడ, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి) :**

పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తూ వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకున్నది. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో అధికారులు ప్రవేశపెట్టిన 32 ఏజెండా అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు, 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు, వనమహోత్సవంలో భాగంగా పట్టణంలో 15 వేల మొక్కలను పంపిణీ చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం రూ.15 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు. పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రజలను మొక్కల సంరక్షణలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

**పార్టీలకు అతీతంగా అభివృద్ధి**

సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిల్ పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారం, మార్గదర్శకత్వంతో మున్సిపాలిటీకి అవసరమైన ప్రత్యేక నిధులను సమకూర్చుకుంటున్నామని తెలిపారు, రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు తదితర ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు, వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డులో కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణకు సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. రాత్రివేళల్లో వీధి దీపాల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏటీసీ లో మిగిలి ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశాలు

**జగిత్యాల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ఏటీసీ లో మిగిలి ఉన్న సీట్లకు నేరుగా ప్రవేశాలు (సీట్లు పరిమితం – త్వరలోనే ముగింపు) జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏటీసీ 2026–2027 విద్యా సంవత్సరానికి గాను 3వ విడత (వాక్–ఇన్) ప్రవేశాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయని పరిమిత సంఖ్యలో ఉన్న సీట్లను నేరుగా వచ్చి పొందే అవకాశం ఉందని జగిత్యాల ప్రభుత్వ ఏటీసీ ప్రిన్సిపాల్ గంట్యాల రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు ఖాళీ సీట్లు త్వరలోనే భర్తీ కానున్నందున అభ్యర్థులు వెంటనే స్పందించాలని సూచించారు ఆన్‌లైన్ దరఖాస్తులు అండ్ వాక్ ఇన్ ప్రవేశాలు 5 9 2026 మధ్యాహ్నం 1గంటల వరకు రోజువారీగా కొనసాగుతాయన్నారు.



## ఆలయ అభివృద్ధికి ఆపన్నహస్తం.. రూ.50,016 విరాళం

**ఆంజనేయస్వామి ఆలయానికి ఏనుగు మనోహర్‌రెడ్డి చేయూత**

**వేములవాడ, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి) :**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లెలో ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి రూ.50,016 విరాళాన్ని అందజేశారు, ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన ఈ మొత్తాన్ని అందించారు, శాత్రాజ్ పల్లెలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విరాళం అందజేసినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు సహకరించాలని కోరారు,ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పర వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన ఏనుగు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు, ఈకార్యక్రమంలో మిట్టపల్లి అనిల్‌రెడ్డి, విక్కుర్తి సాయిబాబు, వనపర్తి జగన్, విక్కుర్తి నారాయణ, రేగుల రాజేశం, బూర గణేష్, గుడిసె మనోజ్, అప్పవారి చక్రపాణి, నాగుల శంకర్, వనపర్తి గంగయ్య, దేశెట్టి ఆశయ్య, కొప్పర సంతోష్‌రెడ్డి, నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె సదానందం, నల్ల తిరుపతిరెడ్డి, బొద్దు కిషన్, గ్రామ కులసంఘాల పెద్దలు, యువకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కట్కమ్ లక్ష్మి మృతికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నివాళి

**రాయికల్ ఆగష్టు 31 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తల్లి కట్కం లక్ష్మి మరణిస్తే ఆమె పార్థిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.తన వెంట జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్లవాణి భర్త శ్రీనివాస్, రాయికల్ సింగిల్ విండో అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి, రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, సింగని రమేష్, ఇంతియాజ్, మత్స్య శేఖర్, వాసం రాజేందర్, మ్యాకల సత్యనారాయణ ఉన్నారు.

## ఎన్ని విమర్శలు చేసినా జగిత్యాలలో అభివృద్ధి ఆగదు

- **ప్యాకేజీ మాటలు మాట్లాడుతున్నారు**
- **జగిత్యాలలో 4500 ఇండ్ల నిర్మాణంలో నా పాత్ర ప్రజలకు తెలుసు**
- **కొత్త బస్టాండ్ పెట్రోల్ బంక్ వివాదం విషయంలో జీవన్ రెడ్డి అనుచరులు మున్సిపల్ లో ఉన్నపుడు ఇచ్చిన అనుమతులు కాదా...**
- **జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



**జగిత్యాల ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి మాటలు ద్వేషపూరితంగా ఉన్నాయని కానీ విమర్శ లా లేవు అన్నారు కార్యకర్తలను కాదని కేసీఆర్ ను చాటుగా కలిసి జీవన్ రెడ్డి ప్యాకేజీ మాటలు మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు గత 10ఏండ్లు కేసీఆర్ ను తీవ్రంగా విమర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు ముఖ్యమంత్రి నీ నన్ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అనడం విడ్డూరంగా ఉందన్నారు ప్రజల కోసం పని చేసినందుకా ప్రైవేట్ లిమిటెడ్ అనడం అని ప్రశ్నించారు జీవన్ రెడ్డి ఇందిరమ్మ ను తిడుతూ రాజకీయాలు చేస్తున్నారు కదా మరి ఇంటికి ఇందిరా భవన్ అని పేరు ఇలా పెట్టుకున్నారని జీవన్ రెడ్డి కి నచ్చనివారిని తిడుతూ రాజకీయాలు చేయడం ప్రజలందరికీ తెలుసునన్నారు 2008 లో ఇందిరమ్మ ఇండ్ల కాలని శంకుస్థాపన చేసి వారిని మర్చిపోతే 17 ఏండ్ల తర్వాత నేను పట్టించుకుని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాన్ని పూర్తి చేయించా ప్రభుత్వంతో కలిసి పని చేస్తేనే అర్బన్ హౌసింగ్ కాలని కి 34 కోట్లు మంజూరు అయ్యాయని

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మేము డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మౌలిక సదుపాయాలు కల్పించలేదు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచాక మీరు ఎమ్మెల్సీగా ఉండి 8 నెలలు ఏం చేశారని ప్రశ్నించారు ఉగాది కి బూరె లు తిని పిస్తానని కాలని వాసులతో అన్నారు ఏమైంది రాష్ట్రంలో అత్యధిక డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ను కేసీఆర్ ఇచ్చారు అది సత్యం వాగు దాటిన తర్వాత తెప్ప తగలేసి మాటలు నాకు రావు ఎప్పుడైనా ఇందిరమ్మ కాలని గురించి నిధులు కావాలని కేసీఆర్ ను కోరారా అని అడిగారు కాంట్రాక్టర్ లు కమిషన్ ఇప్పుడు 15 శాతం గతంలో 4 శాతం అంటే ఎవరిని అంటున్నారు కేసీఆర్ 4 శాతం తీసుకున్నట్టు వయసు పెరిగి ఇష్టారీతిన మాట్లాడుతున్నారు మెడికల్ కాలేజీ ఏర్పాటులో నా ప్రయత్నం ఉంది తెలంగాణలో మెడికల్ కాలేజీ ఆసుపత్రి నర్సింగ్ కాలేజీ ఒక దగ్గర ఉన్న ఏకైక జిల్లా జగిత్యాల 334 వైద్యులు 366 సిస్టర్ లు 730 పడకల ఆసుపత్రి శాంక్షన్ అయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో 8 నెలలు ఎమ్మెల్సీ గా ఉండి మీరు ఏం చేశారు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి కొన్ని పూర్తి అయ్యాయని 2 వేల ఇండ్లు మంజూరు అయ్యాయని 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు త్వరిత గతిన జరుగుతున్నాయన్నారు విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని గొల్లపల్లి రోడ్డులో మహిళా డిగ్రీ కళాశాలను ఎమ్మెల్సీ గా ఉండి పట్టించుకోలేదని

తాటిపల్లి చలిగల్ లిఫ్ట్ పనులు పరిస్తితి ఏంటి ప్రతి పనిని విమర్శించాలంటే గతంలో చేసిన పనుల పై పూర్తి చిట్టా ఉంది కొత్త బస్టాండ్ పెట్రోల్ బంక్ విషయంలో జీవన్ రెడ్డి అనుచరులు మున్సిపల్ లో ఉన్నపుడు ఇచ్చిన అనుమతులు కాదా అని అన్నారు జగిత్యాల సమగ్ర అభివృద్ధి కి కృషి చేస్తున్నామన్నారు గత 4 ఏండ్లులో కాంట్రాక్టర్ లు బిల్లులు రాకనే పనులు చేయలేదు సీనియర్ నాయకులు వారి హయాంలో అభివృద్ధి కన్నా అణిచివేతలకే ప్రాధాన్యం ఇచ్చారు మాజీ జెడ్పీ చైర్మన్ పై విజిలెన్స్ కేసు పెట్టించారు బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుని భూ కబ్జా దారు అన్నారు కేసీఆర్ ను దశాబ్ద కాలం తిట్టారు అవన్నీ మర్చిపోయారా అన్ని నియోజకవర్గాలకు 1500 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేసీఆర్ మంజూరు చేస్తే నేను 4500 నిర్మించామని ప్రజలకు తెలుసునని ఎక్కడా 1500 లో సగం కూడా డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేయలేదని గుర్తు చేశారు

జగిత్యాల ప్రజలకు సేవ చేయాలనే రోజు భూమిపూజ చేస్తున్నానని తుఫిడ్ నిధులు గత ప్రభుత్వం మున్సిపల్ లో డిపాజిట్ చేయకనే పనులు ప్రారంభం కాలేదని పాత బస్టాండ్ పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ బంక్ విషయం లో నేను ఆలస్యం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక ఏడాది లో ఎమ్మెల్సీ గా ఉండి మీరు ఏం చేశారు మంత్రి గా ఉన్నపుడు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు ఎన్ని విమర్శలు చేసినా జగిత్యాల లో అభివృద్ధి ఆగదన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య సీనియర్ నాయకులు బండ శంకర్ మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్కౌన్సిలర్ లు ప్రశాంత్ రావు పిట్ట ధర్మరాజు మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ నాయకులు కప్పల శ్రీకాంత్ రామకృష్ణ రెడ్డి మ్యానపురి మహేష్ నాయకులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదులు స్వీకరణ**

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి) :**



బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 26 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతోపాటు, వారి సమస్యలను పరిష్కరించేలా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు, ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలిగేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

## భీమేశ్వరుడి సన్నిధిలో భక్తజన సందడి

- **భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**
- **క్యూలైన్లలోనే ఉండి ఏర్పాట్లు పరిశీలించిన డీఈవో, ఈఈ**

**వేములవాడ, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి) :**



మూడో సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది.హ, తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ప్రాంగణం భక్తజన సందడితో నిండిపోయింది,స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు, భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) నవీన్‌కుమార్, ఈఈ రాజేష్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు,క్యూలైన్లలో నిలిచి పరిస్థితిని పరిశీలిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశారు,సాధారణ దర్శనంతో పాటు శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం క్యూలైన్లను అధికారులు పరిశీలించారు,భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దర్శన ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు,టికెట్ కౌంటర్లు, చెక్‌పోస్టుల వద్ద రద్దీ పెరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు, అనంతరం భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు నిర్వహించే కోడె మొక్కుల ప్రాంగణం, అద్దె కోడెల విభాగం, నిత్య అభిషేక మండపాలను అధికారులు పరిశీలించారు. భక్తులకు ఆర్జిత సేవలు, మొక్కుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను డీఈవో, ఈఈ స్వయంగా పలకరించి దర్శనం, సేవల నిర్వహణపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు,భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో ఎస్పీఎఫ్ పోలీసులు, హోంగార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం కల్పించాలని సూచించారు,ఈ పర్యవేక్షణలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, శివసాయి, సీనియర్ అసిస్టెంట్ వంశీమోహన్‌శర్మ, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మెట్పల్లి నూతన తహసీల్దార్

**మెట్ పల్లి ఆగస్టు 31 (వుదయం విలేకరి)**



కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని మెట్ పల్లి పట్టణ ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన మెట్‌పల్లి నూతన తహసీల్దార్ ముఫ్తార్ పాషా

## ఎమ్మెల్యే చేతుల మీదుగా క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

**రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాస్ ను ప్రశంశించిన ఎమ్మెల్యే సంజయ్**

**జగిత్యాల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**



ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని గుట్కా తంబాకు వంటి ప్రాణాంతక అలవాట్లకు దూరంగా ఉండాలని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అన్నారు జగిత్యాల పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ దాతల సహకారంతో సమకూర్చిన 40 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ చేతుల మీదుగా క్యాన్సర్ బాధితుడికి అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూకపల్లికి చెందిన రాజ్ కుమార్ అనే వ్యక్తి నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ పీఈటీ స్కాన్ తదితర వైద్య పరీక్షల ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గుర్తించిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ చొరవ తీసుకొని దాతల సహకారంతో పాటు తాను కొంత మొత్తం కలిపి 40 వేల రూపాయలు జమ చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితుడికి అందజేయడం చాలా అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కొనియాడారు వైద్యం ఎంతో ఖరీదైనదవుతున్న ఈ రోజుల్లో గుట్కా తంబాకు నమలడం వల్లనే నోటి క్యాన్సర్ లు విపరీతంగా పెరుగుతున్నాయని ఒక డాక్టర్ గా ప్రజలను హెచ్చరించారు ఆపదలో ఉన్న బాధితుడిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్ సహకరించిన దాతలందరికీ ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## కత్తి వెంకటస్వామిని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామి సతీమణి కత్తి భవాని ఇటీవల మృతి చెందగా సోమవారం హైదరాబాదులోని వెంకటస్వామి స్వగృహంలో ఆయనను పరామర్శించి కత్తి భవాని చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి కత్తి భవాని మృతి చెందడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు అన్నారు.

## సెప్టెంబర్ 1 వ తేదీన ఎస్సీ ఎస్టీ కమిషన్ పర్యటన



**జగిత్యాల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

వచ్చే నెల సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఐదుగురు సభ్యులు జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలా దేవి రాంబాబు నాయక్ కొంకటి లక్ష్మీనారాయణ జిల్లా శంకర్ రేణి కుంట్ల ప్రవీణ్ మంగళవారం మధ్యాహ్నం జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకుంటారు ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులతో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

## విద్యార్థులకు బస్ సౌకర్యం పై రాస్తారోకో...

**కోరుట్ల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**




కోరుట్ల మండలం కల్లూర్ లో గల ఆదర్శ మోడల్ స్కూల్ కు ప్రతిరోజు కోరుట్ల నుండి సుమారు 300 మంది విద్యార్థులు వెళ్తూ ఉంటారు వారికోసం రెండు బస్సులను కేటాయించారు సోమవారం కేవలం ఒక్క బస్సు మాత్రమే రావడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు ఇట్టి విషయంపై గతంలో కూడా బీజేపీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ కు మెమొరాండం ఇచ్చినా గానీ ఎటువంటి ఫలితం లేకుండా పోవడంతో విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకొని కల్లూర్ రోడ్ సబ్ స్టేషన్ వద్ద విద్యార్థులతో కలిసి బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాకల గణేష్‌రోడ్డు పై బైటాయించి రాస్తారోకో చేపట్టారు ఇట్టి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై అనూప్ రావు కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ లు విచ్చేసి సంఘీభావం తెలిపి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్యాం రాజ్ సహకారంతో డిపో మేనేజర్ ను పిలిపించి సమస్యపై చర్చించారు ఎస్ఐ సమక్షంలో ప్రతి రోజు 3 బస్సులను క్రమం తప్పకుండా నడపాలని డిమాండ్ చేయడంతో తప్పకుండా తగు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలియజేయడంతో రాస్తారోకో విరమించారు ఇందుకు సహకరించిన ఎస్ఐ శ్యాం రాజ్ కు భారతీయ జనతా పార్టీ విద్యార్థుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

## గడి బురుజుల భూమికి కేటాయించిన వీఎల్‌టీ నంబర్లను రద్దు చేయాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు**

**కోరుట్ల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణంలోని గడి బురుజుల భూమికి కేటాయించిన వీఎల్‌టీ నంబర్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులను కోరిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణానికి తలమానికంగా ఉన్న గడి బురుజులను కొంతమంది అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా వి ఎల్ టి నెంబర్ లు వేయించుకుని ఆక్రమించుకునెందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు ఎలాంటి నిర్మాణాలు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగామున్సిపల్ అధికారులు వి ఎల్ టి నెంబర్ లు కేటాయించారన్నారు ఈ నెంబర్ ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఆక్రమించుకునెందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో అన్ని కుల యువజన సంఘాల నేతృత్వంలో ప్రజా ఉద్యమం కొనసాగిస్తామన్నారు ఇకనైనా అధికారులు స్పందించి వి ఎల్ టి నెంబర్ లను రద్దు చేసి అట్టి భూమిని కబ్జా కోరుల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొట్ట సురేందర్ మోసిన్ నాయకులు కొక్కెర మహేష్ జాల వినోద్ గెల్లె గంగాధర్ మిట్టపెల్లి రాజశేఖర్ మ్యాకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే భూసేకరణ వేగవంతం చేయాలి

**కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం**

**రాజన్న సిరిసిల్ల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, సేకరించిన భూములను సంబంధిత శాఖలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు, రైల్వే లైన్ల నిర్మాణం, డబ్లింగ్ పనులు, స్టేషన్ల ఆధునీకరణ తదితర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు, రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ పాల్గొన్నారు,రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాల వారీగా రైల్వే ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ పరిస్థితి, నిర్మాణ పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయనే అంశాలపై సీఎస్ సమీక్షించారు,ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, నిర్ణీత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కే.ఎస్.బీ. కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాటకు దిశానిర్దేశం

**పెద్దపల్లిలో మూడు గంటల పాటు పార్టీ శ్రేణులకు కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**

పెద్దపల్లి ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అసమర్థ పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి గారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో జరిగిన జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు ప్రకటించిన వారం రోజుల పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని ఆర్.ఆర్. గార్డెన్‌లో దాసరి మనోహర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ సదస్సులో సెప్టెంబర్ 2 నుంచి చేపట్టనున్న వారం రోజుల పోరుబాట కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు ఆయన సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు కేవలం నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు ఏమిటి? వాటిలో ఎన్ని అమలయ్యాయి? ఇంకా ప్రజలకు ఏ హామీలు బాకీ ఉన్నాయి? అనే విషయాలను ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి ఇంటికి చేరవేసే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని దాసరి మనోహర్ రెడ్డి సూచించారు.

సెప్టెంబర్ 2న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, 420 హామీల మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేలా భారీ ఫ్లెక్సీల ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రజలకు ఇంకా చెల్లించాల్సిన, అమలు చేయాల్సిన హామీలను వివరించే 'బాకీ కార్డులను' ఇంటింటికీ పంపిణీ చేయాలని పార్టీ నాయకులకు వివరించారు. మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రం వరకు ప్రతి కార్యక్రమం సమన్వయంతో జరిగేలా బాధ్యతలు అప్పగించుకోవాలని సూచించారు.

**రైతు సమస్యలపై రైతు సదస్సులు**

రైతాంగ సమస్యలపై సెప్టెంబర్ 3న ప్రతి మండల కేంద్రంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని దాసరి మనోహర్ రెడ్డి గారు సూచించారు. సాగునీరు, విద్యుత్, యూరియా, పంటల బీమా, రైతుల సమస్యలు తదితర అంశాలను రైతుల నుంచి తెలుసుకుని, వాటిపై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి మండలంలో రైతులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేసి, నియోజకవర్గ స్థాయిలో రైతుల సమస్యలను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. మహిళలు, వికలాంగులు తదితర వర్గాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని తెలిపారు. మహిళలకు కాంగ్రెస్ ఇచ్చిన రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి , షాదీముబారక్, తులం బంగారం వంటి హామీల అమలు పరిస్థితిని ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయాలని చెప్పారు. ప్రజల్లోకి బలంగా సందేశం వెళ్లేలా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వంటావార్పు వంటి వినూత్న నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు, యువత సమస్యలపై సెప్టెంబర్ 5న నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని దాసరి మనోహర్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై కార్యక్రమాలు జరుగుతుండగా, పెద్దపల్లి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల సమస్యలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు తదితర సమస్యలపై ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి మండలంలో స్థానికంగా ఉన్న ప్రధాన ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని ప్రజలకు భరోసా కల్పించాలని అన్నారు. సెప్టెంబర్ 7న మండల, జిల్లా ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు సమర్పించాలని సూచించారు.

**జిల్లా స్థాయి ప్రెస్‌మీట్లు**

వారం రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలపై సెప్టెంబర్ 8న జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన, బీఆర్ఎస్ చేపట్టిన పోరాట కార్యక్రమాల వివరాలను ప్రజలకు, మీడియాకు వివరించాలని తెలిపారు.

అదే సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు.

సెప్టెంబర్ 10 – ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాటానికి సంఘీభావం

సెప్టెంబర్ 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి సంఘీభావం ప్రకటించి, పార్టీ శ్రేణులు అండగా నిలవాలని దాసరి మనోహర్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. మండలం నుంచి నియోజకవర్గం వరకు సమన్వయంతో కార్యక్రమాలు

ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి గారు మాట్లాడుతూ, "కేటీఆర్ గారు ఇచ్చిన పిలుపు మేరకు పెద్దపల్లి నియోజకవర్గంలో వారం రోజుల పోరుబాట కార్యక్రమాలను అత్యంత విజయవంతంగా నిర్వహించాలి. ప్రతి మండలంలో ఒక ప్రత్యేక కార్యాచరణ, నియోజకవర్గ స్థాయిలో సమన్వయంతో కార్యక్రమాలు ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేసి, వాటి అమలు పరిస్థితిని ప్రజల ముందుంచాలి" అని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన, విద్యార్థి, మహిళా నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాల్లో భాగస్వాములు




కావాలని సూచించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని దాసరి మనోహర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.

ఈ అవగాహన సదస్సులో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, స్రవంతి మోహన్ రావు, మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, మల్లేశం, దేవయ్య, బోయిని రాజమల్లు, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, కౌన్సిలర్ ఓదెలు, సర్పంచులు దీకొండ భూమేష్, బోయిన్ శ్రీనివాస్ లావణ్య,ఓజా సంపత్,గొడుగుల సతీష్, తోగరు శ్రీనివాస్,పాఠకుల అనూష అనిల్, మచ్చ అరుణ యాదగిరి, సదాశివ రెడ్డి, అదిగోపుల రాణి మోహన్,తీగల నాగరాజు, ఖమ్మం పల్లి బాపయ్య, చొప్పరి అంజన్న, BRS నాయకులు సలేంద్ర రాములు, తీగల సదయ్య, రాజయ్య, రామ్ రెడ్డి, సంపత్, త్రిపుర దయాకర్, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, మోహన్ రెడ్డి, శీను, చంద్ర మొగిలి, లక్ష్మణ్, మేడకోన శ్రీకాంత్ గౌడ్, జలపతి, ఉప్పల సంపత్ కుమార్, అశోక్,రమణారెడ్డి, రమేష్, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షుద్ర పూజల పేరుతో రూ.62 లక్షలు టోకరా !





- అనారోగ్యం నయం చేస్తామంటూ మహిళకు కుచ్చుటోపి
- చేతబడి గుప్తనిధుల పేరుతోనూ మోసం.. ఇద్దరి అరెస్ట్
- రూ.30.50 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, పూజా సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి) :

అనారోగ్యాన్ని క్షుద్ర పూజలతో నయం చేస్తామని నమ్మించి ఓ మహిళ నుంచి ఏకంగా రూ.62 లక్షల వరకు నగదు, బ్యాంకు లావాదేవీల ద్వారా డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడులు, గుప్తనిధుల పేరుతో అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు, నిందితుల నుండీ రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, క్షుద్ర పూజలకు వినియోగించే బెల్లంతో తయారు చేసిన రెండు బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు, ఈ వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సోమవారం మీడియా ముందు వెల్లడించారు,కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన తురుపాటి శ్యాం కుమార్ (57) ప్రస్తుతం హైదరాబాద్ తూముకుంటలో 'భద్రకాళి పూజ స్టోర్' నిర్వహిస్తున్నాడు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం (60) తరచూ అతడి వద్ద పూజా సామగ్రి కొనుగోలు చేసేవాడు ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది,అగ్రహారం, పరిసర గ్రామాల్లో క్షుద్ర పూజలు, మంత్రాలు, దిష్టి, చేతబడుల పేరుతో అమాయకులను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నానని లక్ష్మీరాజం శ్యాం కుమార్‌కు చెప్పాడు. తెలిసిన వారిని తన వద్దకు పంపిస్తే పూజల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ఇద్దరం సమానంగా పంచుకుందామని ప్రతిపాదించగా శ్యాం కుమార్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.ఉప్పల్‌కు చెందిన బండారి లత అనే మహిళ జనవరిలో పూజా సామగ్రి కోసం శ్యాం కుమార్ దుకాణానికి వెళ్లింది కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదని అతడికి చెప్పింది దీంతో ఆమెకు దేవుళ్లు, పూజలపై ఉన్న నమ్మకాన్ని ఆసరాగా చేసుకున్న శ్యాం కుమార్.. క్షుద్ర పూజలతో దీర్ఘకాలిక అనారోగ్యాన్ని పూర్తిగా నయం చేయవచ్చని నమ్మించాడు,వేములవాడ అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజం మంత్రాలు, క్షుద్ర పూజలు చేస్తాడని, చాలామందికి నయం చేశాడంటూ ఆమెను నమ్మించాడు ఫిబ్రవరిలో సిరిసిల్ల పాత బస్టాండ్ వద్దకు తీసుకొచ్చి లక్ష్మీరాజంతో పరిచయం చేశాడు,పథకం ప్రకారం లక్ష్మీరాజం కూడా లతను మాటలతో నమ్మించి పూజలు చేస్తే అనారోగ్యం నయం అవుతుందని చెప్పాడు పూజా సామగ్రి కోసం రూ.10 లక్షలు కావాలని కోరగా ఆమె అదే రోజు రూ.10 లక్షలు నగదుగా ఇచ్చింది,అనంతరం వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి పూజల పేరుతో మరింత డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు, యాదగిరిగుట్ట వద్ద రూ.21 లక్షలు, కాశీలో రూ.13 లక్షలు నగదుగా తీసుకున్నారని, శ్యాం కుమార్ సూచించిన బ్యాంకు ఖాతా, ఇతర ఖాతాలకు విడతల వారీగా సుమారు రూ.62 లక్షల వరకు బదిలీ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. కొంత మొత్తాన్ని ఆమెతోనే ఖర్చు చేయించినట్లు పోలీసులు వెల్లడించారు, అంతేకాకుండా తమ మోసం బయటపడుతుందనే భయంతో లత చేత తెల్లకాగితాలపై సంతకాలు కూడా చేయించుకున్నారని పోలీసులు తెలిపారు.అనారోగ్యం నయం కాలేదని, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆమె పలుమార్లు కోరగా క్షుద్ర పూజలు, చేతబడులతో ఆమెను, కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు, అదేవిధంగా ఆమె పొలంలో పెద్ద మొత్తంలో గుప్తనిధులు ఉన్నాయని, వాటిని వెలికితీసి ఇస్తామని చెప్పి మరికొంత కాలం నమ్మించినట్లు తెలిపారు. ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల పాత బస్టాండ్‌కు రావాలని చెప్పి ఆమె అక్కడికి చేరుకున్న తర్వాత నిందితులు రాకుండా మోసం చేశారు.

**ఫిర్యాదుతో కదిలిన పోలీసులు..**

దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అగ్రహారం గ్రామంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసు: క్రైం నం. 478/2026, సెక్షన్లు 318(4), 316(2), 308(5) r/w 3(5) BNS, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్–1954లోని సెక్షన్ 7 కింద సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, చేతబడులు, మంత్రాలు పరిష్కారం కాదని ప్రజలు గుర్తించాలని ఎస్పీ సూచించారు, ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి సరైన చికిత్స పొందాలని కోరారు. పూజలు, మంత్రాలు, గుప్తనిధులు లేదా ఇతర మూఢనమ్మకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- కోరుట్ల పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ
- రికార్డులు కేసుల దర్యాప్తుపై సమగ్ర పరిశీలన
- డివిజన్ పోలీస్ అధికారి రాములు

కోరుట్ల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)




కోరుట్ల పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం డివిజన్ పోలీస్ అధికారి రాములు సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి విధుల నిర్వహణ కేసుల దర్యాప్తు పురోగతి శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ లోని కేసులకు సంబంధించిన ఫైల్స్ వివిధ రకాల రిజిస్టర్లు రికార్డులు ఇతర ముఖ్యమైన దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించారు పెండింగ్ కేసుల వివరాలు దర్యాప్తు పురోగతి రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు అలాగే పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ లో పరిశుభ్రత రికార్డుల సక్రమ నిర్వహణ ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు అనంతరం డీఎస్పీ సిబ్బంది తో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు విధి నిర్వహణలో అంకితభావం క్రమశిక్షణ అప్రమత్తతతో పని చేయాలని సూచించారు ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి చట్టపరంగా వేగవంతమైన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని డీఎస్పీ స్టేషన్ సిబ్బందికి సూచించారు ఇట్టి వార్షిక తనిఖీ లో కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ కే లక్ష్మీనారాయణ కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ జి శ్యామ్ కోరుట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన తుంగూరి వెంకటేశం

**ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్**

జగిత్యాల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)




విధి నిర్వహణలో అత్యుత్తమైన సేవలు తుంగూరు వెంకటేశం అందించారని జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాష్ అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికో సోషల్ వర్కర్ గ్రేడ్ 1 తుంగూరి వెంకటేశం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదోన్నతులు బదిలీలు పదవి విరమణలు సర్వసాధారణం అన్నారు ఈ సందర్భంగా తుంగూరి వెంకటేశం విధి నిర్వహణలో సమయపాలన క్రమశిక్షణ అంకితభావంతో పని చేసే వారని ఆయన ఎంతోమందికి ఆదర్శం అని అన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ఓడి డాక్టర్ రణధీర్ పీడియాట్రిక్ డాక్టర్ కళ్యాణ్ కుమార్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్ తుంగూరి సురేష్ సిబ్బంది బంధువులు తదితరులు పాల్గొన్నారు



# కళాకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

జగిత్యాల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ వారి ఆధ్వర్యం లో ఇటీవల నిర్వహించిన బోనాల జాతర –2026 కార్యక్రమం విజయవంతం కాగా జగిత్యాల బిఎల్ఎన్ గార్డెన్స్ లో వారి ఆహ్వానం మేరకు బోనాల జాతర విజయోత్సవ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ గజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య ఈ కార్యక్రమంలో సింగర్ మల్లిక్ తేజ సేవాదళ్ అధ్యక్షులు ముకేష్ ఖన్నా జగిత్యాల జిల్లా యూట్యూబర్స్ కళాకారుల ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణి

పెద్దపల్లి ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)

మండలంలోని భోజన్నపేట, మారేడుగొండ, పెద్దకల్వల,మేరపల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగింది. మహిళా సంఘాల సభ్యులు యూనిఫామ్స్ కుట్టి పాఠశాల అధికారులకు ఇవ్వడంతో వారు ఆయ పాఠశాల విద్యార్థులకు అందజేశారు 2026 –2027 సంవత్సరానికి గాను మండలంలోని 54 పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయడం జరుగుతుంది. మహిళా సంఘాల సభ్యులచే యూనిఫామ్స్ కుట్టించడం ద్వారా వారికి ఉపాధి లభించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అవుతున్నామని నిర్వాహకులు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలకు యూనిఫామ్స్ అందించడం పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు మరియు ఏపిఎం శాంతి శైలజ,సిసి అనాసి శ్రీనివాస్,వీవోఏ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)

కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన అలెపు గంగరాజం తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీస్ లు దర్యాప్తు ప్రారంభించారు నర్సయ్య వివరాల ప్రకారం గంగరాజాం పెద్ద కుమారుడు అలెపు రమేష్ (32) కొంతకాలంగా దుబాయ్‌లో ఉంటూ సుమారు నెల రోజుల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చినాడు గత కొన్ని రోజులుగా రమేష్‌కు అతని భార్యతో కుటుంబ విషయాలపై తరచుగా గొడవలు జరుగుతున్నాయి. తేదీ 30 8 2026 రోజు రాత్రి రమేష్ మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

# సీఎం కప్ క్రీడా పోటీల్లో దుర్వినియోగమైన నిధులు

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వివిధ క్రీడా సంఘాలు**

కోరుట్ల ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)


Citizen Copy
Government of Telangana
Jagitial District Prajavani Acknowledgment

2024 సంవత్సరం సీఎం కప్ క్రీడా పోటీలలో నిధుల దుర్వినియోగం చేయడం జరిగింది 2025 సీఎం కప్ క్రీడా పోటీలకు సంబంధించిన నిధులు పై అనుమానాలు అన్ని క్లస్టర్లకు డబ్బులు విడుదల చేయలేదని అస్మిత క్రీడా పోటీలకు సంబంధించి నిధుల దుర్వినియోగం 2024 సంవత్సరం సీఎం కప్ పోటీలకు జగిత్యాల జిల్లాకు 6 లక్ష 25 వేల రూపాయలు కేటాయించారు కానీ వారు ఖర్చు చేసింది 3 లక్ష 01 వెయ్యి 168 రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగింది కొన్ని క్రీడా సంఘాలతో 2024 సియం టీం పంపే క్రమంలో వారిని టిఏ డిఏ పెట్టుకొని టీంలను పంపించమని అనడం జరిగింది దాని తర్వాత బిల్లు పెట్టిన తర్వాత ఇస్తామని చెప్పడం జరిగింది కానీ ఎప్పుడు అడిగినా రాలేవని అబద్ధాలతో పబ్బం గడుపుతూ నిధులను దుర్వినియోగం చేశారు అలాగే 2025 సంవత్సరం సీఎం కప్ క్రీడా పోటీలకు 7 లక్ష 60 వేల రూపాయలు కేటాయించడం జరిగింది కానీ అన్ని క్లస్టర్లకు నిధులు ఇవ్వడం జరగలేదు జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీలకు సంబంధించిన భోజన వసతులను స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించడం జరిగింది అలాగే అస్మిత క్రీడా పోటీలలో దుర్వినియం జరిగినట్టు కూడా అనుమానాలు ఉన్నాయి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో వివిధ క్రీడా సంఘాలు ఫిర్యాదు చేశాయి.

# విద్య ఒక్కటే అసమానతలను రూపుమాపే అస్త్రం




**స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

పెద్దపల్లి,ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)

సమాజంలో అసమానతలు తొలగిపోయి నిజమైన సామాజిక స్వాతంత్ర్యం సిద్ధించాలంటే నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన స్వేరోస్ జ్ఞాన సమ్మేళన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా, పెద్దపల్లి జిల్లా నాయకురాలు దాసరి ఉష ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.ముందుగా మధురానగర్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుండి ర్యాలీగా వచ్చి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సభనుద్దేశించి మాట్లాడుతూ,తరతరాలుగా కొనసాగుతున్న ఆర్థిక,సామాజిక అంతరాలు కేవలం విలువలతో కూడిన విద్య ద్వారానే తొలగిపోతాయని ఉద్ఘాటించారు.బహుజన, పేద వర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ, వ్యవస్థాపక రంగాల్లో కీలక నిర్ణయాత్మక స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.యువత కేవలం అక్షరాస్యతతో సరిపెట్టుకోకుండా, చుట్టూ జరుగుతున్న పరిణామాలు , హక్కులపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు.యువత వ్యూహాత్మకంగా అడుగులు వేసి నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ,నేటి యువత సాధారణ చదువులు,ఉద్యోగాలకే పరిమితం కాకుండా విస్తృతమైన సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారానే సమాజంలో గుణాత్మక మార్పు సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వేరో భావజాలంతో ముందుకు సాగి, ఎవరి కాళ్లపై వారు నిలబడేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుండి విద్యార్థి సంఘాల ప్రముఖులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ ద్వారా ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రెమిడియేషన్ తరగతులను 10 వారాల పాటు సమర్థవంతంగా నిర్వహించాలి
- కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు నాణ్యమైన అకడమిక్ ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలి
- ఎఫ్ఎల్ఎన్ అమలుపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షించిన కలెక్టర్

పెద్దపల్లి ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)




ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యా నైపుణ్యాలను సాధించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తొలిమెట్టు కార్యక్రమం అమలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో సాధించిన ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో సాధించాల్సిన లెర్నింగ్ ఔట్‌కమ్స్, విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధి, రెమిడియేషన్ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు తనకు నిర్దేశించిన విద్యా లక్ష్యంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి తరగతిలో విద్యార్థులు సాధించాల్సిన ప్రాథమిక నైపుణ్యాలు ఏమిటో స్పష్టంగా నిర్దేశించుకొని, వాటిని సాధించే విధంగా బోధనా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో ప్రస్తుతం ఎఫ్ఆర్ఎస్ (Foundational Reading Skills) 72 శాతంగా ఉందని, దీనిని కనీసం 80 శాతానికి పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో ఎఫ్ఎల్ఎన్ స్థాయి పెరిగే కొద్దీ ఎఫ్ఆర్ఎస్ కూడా సహజంగానే మరింత మెరుగుపడుతుందని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 4, 5వ తరగతుల విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్‌లో మంచి ఫలితాలు సాధించారని, ఈ విద్యా సంవత్సరంలో కూడా అదే ఫలితాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో 2, 3వ తరగతుల విద్యార్థులపై మరింత ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసనలో ప్రారంభ దశలోనే పునాది నైపుణ్యాలను పటిష్టం చేస్తే తదుపరి తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులు సాధించాల్సిన లెర్నింగ్ ఔట్‌కమ్స్‌పై స్పష్టమైన గోల్స్ ఫిక్స్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా పాఠశాల వారీగా విద్యా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా తోడుగా ప్రత్యేక రెమిడియేషన్ కార్యక్రమాన్ని కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల్లో గుర్తించిన అభ్యసన లోపాలను అధిగమించేందుకు రెమిడియేషన్ తరగతులను 10 వారాల పాటు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించి నిర్దేశించిన సిలబస్, లెర్నింగ్ ఔట్‌కమ్స్‌ను క్షుణ్ణంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ విద్యా లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల తమకు కేటాయించిన పాఠశాలలను తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రతి నెలా సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎఫ్ఎల్ఎన్, తొలిమెట్టు, రెమిడియేషన్ కార్యక్రమాల అమలును సమీక్షించాలని సూచించారు. జిల్లాలో ఎఫ్ఎల్ఎన్, తొలిమెట్టు, రెమిడియేషన్ కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. షేక్, జిల్లా రిసోర్స్ పర్సన్స్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 31 మంది సర్వేయర్ల లైసెన్సులు రద్దు అన్యాయం

**బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**

పెద్దపల్లి ఆగస్టు 31 (ఉదయం ప్రతినిధి)



పెద్దపల్లి జిల్లాలో 31 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులను రద్దు చేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా పెద్దపల్లి జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయడం అన్యాయమని ఆరోపించారు. లైసెన్సుల రద్దుతో ఉపాధి కోల్పోయిన సర్వేయర్లకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రద్దు చేసిన లైసెన్సుల విషయంలో ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద్, రాష్ట్ర సలహాదారు గోవర్ధన్, జిల్లా నాయకులు తిరుపతి, సురేష్, గోపి, అభిలాష్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**నిజామాబాద్, ఆగస్టు 31 :**

రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మధిర కోర్టులో మెగా లోక్ అదాలత్ సన్నాహక సమావేశం



**మధిర, ఆగస్టు 31, వుదయం ప్రతినిధి:**

2026 సెప్టెంబర్ 12వ తేదీన మధిర కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి మధిర కోర్టు న్యాయమూర్తి దీప్తి వేముల ఆధ్వర్యంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించడం, ఇరుపక్షాల సమ్మతితో వివాదాలను సత్వరమే పరిష్కరించే విధానంపై చర్చించారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన, సులభంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశం ఉందని న్యాయమూర్తి దీప్తి వేముల తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, క్రిమినల్ కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసులు తదితర రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో వైరా ఏసీపీ ఎస్ సారంగపాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు,వాసంశెట్టి కోటేశ్వరావు, జ్ఞానేష్, ఏపీపి జన్ను భద్రయ్య,మాధురి తదితరులు , కోర్టు సిబ్బంది మరియు అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు అధికారులు పాల్గొని మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు.ప్రజలు మరియు కక్షిదారులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకొని తమ పెండింగ్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు.

# రంగంలోకి డీఎస్పీ.. మర్రిగూడలో మూడు ఇళ్ల చోరీలపై దర్యాప్తు

**మర్రిగూడ,ఆగస్టు31 (వుదయం):**

మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, ఖుదాబక్ష్‌పల్లి గ్రామాల్లో కలకలం రేపిన చోరీల ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నేరం జరిగిన ప్రాంతాలను దేవరకొండ డీఎస్పీ స్వయంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో 3 ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.సామాజిక మాధ్యమాల్లో వస్తున్నట్లు ఇవి 'వరుస చోరీలు' కావని, ఒకే రోజు జరిగిన ఘటనలని మర్రిగూడ ఎస్‌ఐ రాంబాబు స్పష్టం చేశారు. బాధితులు అందుబాటులో లేకపోవడం వల్లే వేర్వేరు రోజుల్లో ఫిర్యాదులు అందాయని, ప్రజలు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువ రోజులు ఊరు వెళ్లేటప్పుడు పోలీసులకు లేదా ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.





## 108 లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన గర్భిణీ

**జన్నారం,ఆగస్ట్ 31 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలంలోని కవ్వాల్, హాస్టల్ తండాలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి 108 సిబ్బంది అంబులెన్స్ లోనే కాన్పు నిర్వహించి పండంటి ఆడబిడ్డకు పురుడు పోశారు.హాస్టల్ తండాకు చెందిన కొమురె అనసూయ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు. దండేపల్లి అంబులెన్స్ కు కాల్ వెళ్లగా అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన హాస్టల్ తండా గ్రామానికి చేరుకున్నారు. హాస్పిటల్ కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ను పక్కకు ఆపి కాన్పు చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలకు ప్రథమ చికిత్స అందించి జన్నారం ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ మునిందర్ గౌడ్,పైలట్ మహేందర్ తెలిపారు.



# శిరీష పార్థివదేహానికి నివాళులర్పించిన తాటి

**అశ్వారావుపేట, ఆగస్టు 31, (వుదయం ప్రతినిధి):**

అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష హైదరాబాద్‌లోని ప్రేమ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ మానభంగానికి గురై, తీవ్ర గాయాలతో మృతి చెందారు. శిరీష పార్థివదేహాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. శిరీషపై మానభంగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సన్నద్ ఉల్లా ఖాన్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు , పార్కలగండి సర్పంచ్ సుశీల మాజీ సర్పంచ్ వాడే నాగరాజు , చెన్నయ్య , కరటూరి కృష్ణ , పామర్తి వెంకటేశ్వరరావు , చల్ల వెంకటేశ్వర్లు , దేవ స్వామి ,బైటి రాజేష్ , పోడియం ప్రేమ్ , రింగ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# కోదాడలో పోలీసు రాజ్యం ఎందుకు?



- **సీఐ శివశంకర్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి విధుల నుంచి తప్పించాలి**
- **మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ ఆగస్టు 31 (వుదయం)**

కోదాడ పట్టణ సీఐ శివశంకర్ వ్యవహారశైలితో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. ఓ ఒంటరి మహిళకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సోమవారం నిర్వహించిన కోదాడ పట్టణ బంద్‌లో ఆయన మాట్లాడారు. సీఐపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, విచారణ పూర్తయ్యే వరకు ఆయనను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.సీఐ శివశంకర్ కోదాడకు వచ్చిన తర్వాత హింస, నేరాలు, దొంగతనాలు, సెటిల్మెంట్లు పెరిగాయని మల్లయ్య యాదవ్ ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లోనే కొన్ని సెటిల్మెంట్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయని అన్నారు. పోలీసుల ప్రధాన బాధ్యత ప్రజలకు రక్షణ కల్పించడమే తప్ప, వారిని భయభ్రాంతులకు గురిచేయడం కాదని పేర్కొన్నారు.సీఐ గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని మల్లయ్య యాదవ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రమావత్ రమేష్ నాయక్ ఆత్మహత్య ఘటనలో సీఐపై మృతుడి భార్య ఆరోపణలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 17న హిజ్రాపై దురుసుగా ప్రవర్తించిన ఘటనపైనా సీఐపై ఆరోపణలు వచ్చాయని అన్నారు. నలంద రోడ్డులో గిరిజన మహిళను వేధింపులకు గురిచేసి రోడ్డుపైకి పంపించారని ఆయన ఆరోపించారు. ఐదు నెలల పసికందును తల్లి నుంచి వేరు చేసి, ఆమెను నిర్బంధించడం వల్ల చిన్నారికి పాలు అందని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

**గంజాయి కేసుపైనా సమగ్ర దర్యాప్తు చేయాలి**

కోదాడలో 150 కిలోల గంజాయి పట్టుబడిన ఘటనపైనా అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.వ్యాపారులు, రియల్టర్లు, లిక్కర్ వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. సీఐపై ఇన్ని ఆరోపణలు వస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఎందుకు ఆయనను వెనుకేసుకొస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.సోషల్ మీడియాలో వార్తలు, రిపోర్టులు చేసినందుకు ఉపేందర్‌పై కేసులు నమోదు చేసి రోజుల తరబడి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం సరికాదని మల్లయ్య యాదవ్ అన్నారు. తాను సీఐపై చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో రుజువు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.దుర్గాపురం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన ఘటనపైనా పోలీసుల తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

**సెప్టెంబర్ 2న పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా**

సీఐ శివశంకర్‌పై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2న కోదాడ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని, సీఐని విధుల నుంచి తప్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు.

# కత్తుల రవి ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమం

**ఆర్టిజన్ 541 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**చింత ఎల్లయ్య**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 31**

నల్గొండ పట్టణ కేంద్రంలో మిర్యాలగూడ రోడ్డు వైపు ఉన్న ఏచూరి గార్డెన్ లో పదవి విరమణ చేపట్టిన కత్తుల రవి డివిజనల్ ఇంజనీరింగ్ టీజీ ట్రాన్స్కో డిపార్ట్మెంట్లో ఎన్నో సేవలు చేపట్టి మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన ఆనాడు 1992. డిపార్ట్మెంట్ లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టినా కత్తుల రవికుమార్ .డి ఈ రిటైర్మెంట్ ఫంక్షన్ కి ఈరోజు ఆర్టిజన్ కుటుంబాలకు ఎంతో మందికి సాహసాకారాలు తన వంతు అందిస్తూ కొన్ని వందల మంది కుటుంబాలకు ఈరోజు స్థిర స్థాయిలో నిలిచిపోయిన మన యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రిటైర్మెంట్ ఫంక్షన్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరం భాగ్యసముల్లై రిటైర్మెంట్ ఫంక్షన్ లో పాల్గొనవలసిందిగా రాష్ట్ర కార్యదర్శి చింత ఎల్లయ్య పిలిపించారు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ భగవంతుని మనసారా కోరుకుంటూ వారికి ఇంకా ఎంతోమందికి పాలు పంచుకొని నిరంతరం కార్మికుల కోసం పనిచేస్తున్న ఈరోజు విద్యుత్ సంస్థకు దూరం కావడం చాలా బాధాకరం. కాబట్టి నాతోటి ఉద్యోగులందరూ ఈరోజు హాజరై ఘనంగా సన్మానం చేయవలసిందిగా కోరుతున్నాం. ట్రాన్స్కో కంపెనీ అధ్యక్షులు మేకల లింగయ్య జిల్లా అధ్యక్షులు గురజాల యాదగిరి కొత్తపల్లి బాబురావు ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.





## చండూరు ప్రజావాణికి 'రెండు' వినతులు

**చండూరు, ఆగస్టు 31(వుదయం):**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అర్జీలు వచ్చాయి. మండల పరిధిలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో యాదగిరి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించినట్లు తెలిపారు. బాధితుల అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి, పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. సకాలంలో పరిష్కారం లభించేలా చూస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**

**సత్తుపల్లి ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ, నియోజకవర్గంలోని సుమారు 60 వేల కుటుంబాలకు బీఆర్ఎస్ బాకీ కార్డులను అందించాలని సూచించారు. 100 రోజుల్లో 13 డిక్లరేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సండ్ర విమర్శించారు. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బోనస్, యూరియా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, కళ్యాణలక్ష్మి –షాదీ ముబారక్, విద్యా భరోసా, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల వంటి హామీల పరిస్థితి ఏమైందని ఆయన ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివిధ యాప్‌లు, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సండ్ర మండిపడ్డారు. ధరణి స్థానంలో భూ భారతి తీసుకొస్తామని చెప్పి.. రైతుల భూ సమస్యలను మరింత సంక్లిష్టం చేశారని ఆయన ఘాటుగా విమర్శించారు. భూ సమస్యల పరిష్కారం పేరుతో రైతులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడినే ప్రాతిపదికగా తీసుకుని పథకాలు అందించామని సండ్ర అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల రాజకీయ నేపథ్యాన్ని చూసి సంక్షేమ పథకాలు అందించే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. 1000 రోజుల సమయం ఇచ్చాం.. ఇక ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి కుటుంబానికి వివరించాలి. బీఆర్ఎస్ బాకీ కార్డులను ప్రజలకు అందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని సండ్ర వెంకట వీరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని ఆయన సూచించారు.



# ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అధికారులకు ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**

సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఆగస్టు 31న పదవీ విరమణ పొందుతున్న సివిల్ విభాగం ఏజీఎం రామకృష్ణ, జీఎం కార్యాలయ అకౌంట్స్ ఆఫీసర్ కోదుమూరి శ్రీనివాస్, జనరల్ అసిస్టెంట్ శ్రీమతి శారదను ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయం, సివిల్ డిపార్ట్‌మెంట్ పిట్ కార్యదర్శులు సి.హెచ్. సాగర్, మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎస్.ఓ.టు.జీఎం గోవిందరావు, ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.డి. రజాక్ మాట్లాడుతూ.. ఏజీఎం రామకృష్ణ 1989లో ఏఈగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, సింగరేణి సంస్థలోని పలు ఏరియాల్లో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా పదోన్నతులు పొందారని తెలిపారు. చివరగా కొత్తగూడెం ఏరియాలో ఏజీఎంగా సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. అదేవిధంగా అకౌంట్స్ ఆఫీసర్ కోదుమూరి శ్రీనివాస్ క్లర్క్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, వివిధ హోదాల్లో పదోన్నతులు పొందుతూ అకౌంట్స్ ఆఫీసర్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్నారని పేర్కొన్నారు. జనరల్ అసిస్టెంట్ శ్రీమతి శారద జీఎం కార్యాలయంలో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ మంచి ఉద్యోగినిగా పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులు, సివిల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## విద్యుత్ శాఖలో అరుదైన ఆత్మీయ వీడ్కోలు

- **రిటైర్డ్ జే ఏ ఓ సత్యనారాయణకు ఘన సన్మానం**
- **డిపార్ట్మెంట్ వాహనంలో ఇంటికి సాగనంపిన అధికారులు**

**సూర్యాపేట ఆగస్టు 31: వుదయం ప్రతినిధి**

విద్యుత్ శాఖ సర్కిల్ ఆఫీస్, సూర్యాపేటలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా పనిచేసి నేడు పదవీ విరమణ పొందిన శ్రీ నామేపల్లి సత్యనారాయణ ని ఘనంగా సన్మానించారు. అనంతరం మొట్టమొదటిసారిగా డిపార్ట్మెంట్ వాహనంలో తీసుకెళ్లి వారి ఇంటి వద్ద దింపడం జరిగింది. విద్యుత్ శాఖలో ఇలాంటి సంప్రదాయాన్ని పాటించడం చాలా సంతోషదాయకమని, దీనిని ఇలాగే కొనసాగించాలని సూర్యాపేట 1104 యూనియన్ ప్రాంతీయ అధ్యక్షులు శ్రీ నేతకాని వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. శ్రీనివాసులు, డివిజనల్ ఇంజనీర్ ఎన్. వెంకటకృష్ణయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ లక్ష్మయ్య, పి. యాదగిరి నాయుడు (జే ఏ ఓ), దయాకర్ రెడ్డి (జె ఏ ఓ), పి. మల్లికార్జున్, దశరథ రెడ్డి, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కారాగారం పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జ్

**కరీంనగర్ ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి):**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి వై.యశ్వంత్ సింగ్ జిల్లా కారాగారాన్ని సందర్శించి ఖైదీలకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా శిక్షణ అనుభవిస్తున్న మరియు విచారణ ఖైదీలతో మాట్లాడుతూ డబ్బుపై వ్యామోహంతో గంజాయి సేవించిన, అమ్మిన, కలిగి ఉన్న కఠినమైన శిక్షలు కలవని, నేరాలు అలవాటు చేసుకోకూడదని, తెలియజేశారు విచారణ ఖైదీలు జిల్లా కారాగారాన్ని ఒక పరివర్తన కేంద్రంగా భావించాలని, కారాగారంలో గడిపిన కాలంలో సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తర్వాత ఎటువంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని తెలియజేశారు. ఎటువంటి న్యాయసహాయమైన కారాగారం ను సందర్శిస్తున్న ఉచిత న్యాయవాదులను సంప్రదించి న్యాయసహాయము పొందాలని తెలియజేశారు. కారాగారంలో న్యాయ శివాధికార సంస్థ యొక్క చరవాణి నెంబర్ను ఖైదీలకు కనిపించే స్థలంలో ప్రదర్శించాలని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై.యశ్వంత్ సింగ్ తో పాటు డిప్యూటీ లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, జైలర్ లు లక్ష్మీనారాయణ, అజయ్, డిప్యూటీ జైలర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ వేణు తో పాటు కారాగార సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రధానోపాధ్యాయుడు డా. జె. సురేష్‌కుమార్ ఉద్యోగ విరమణ

**మంథని, ఆగస్టు 31వుదయం ప్రతినిధి**

మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన డా. జె. సురేష్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది ఆయనకు శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల ప్రగతికి డా. సురేష్‌కుమార్ అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. రమేష్, ఎం. శ్రీదేవి, ఎల్. శ్రీనివాస్, ఎస్. దేవేందర్, కె. సుధాకర్, జె. అనిల్, పి.ఎన్. రాజు, టి. రవీంద్ర తదితరులు పాల్గొని డా. సురేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# నల్లగొండ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ యాదవ్



**నల్గొండ జిల్లా, వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 31**

నల్గొండ జిల్లా చిట్యాల ముద్దు బిడ్డ బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షులుగా నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సోదరులు కంబాలపల్లి సతీష్ కుమార్ యాదవ్ మీరు చిట్యాల కనక దుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం శాలువా తో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరికంటి మొగులయ్య గారు బిజెపి పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ బిజెపి sc మోర్చా నాయకులు sc మోర్చా రాష్ట్ర అధికారం ప్రతినిది రుద్రవరం లింగ స్వామి గారు మాస శ్రీనివాస్ బీజేపీ సీనియర్ కన్నె బోయన మహాలింగం బీసీ మోర్చా జిల్లా ఉపా అధ్యక్షులు గంజి గోవర్ధన్ జిల్లా కౌన్సిల్ మెబర్ కూరెళ్ల శ్రీను జిల్లా కార్య వర్గ సభ్యులు జయరాపు రామకిష్ణ కూరెళ్ల శ్రీనివాస్ పల్లె వెంకన్న కాంచర్ల శంకర్ రెడ్డి బీజేపీ bjym రాష్ట్ర జిల్లా పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మంథనిలో టీ షాపుల బంద్

**మంథని, ఆగస్టు 31వుదయం ప్రతినిధి**

చక్కెర ధరతో పాటు నిత్యవసర సరుకుల ధరలు అమాంతం పెరగడాన్ని నిరసిస్తూ సోమవారం మంథని పట్టణంలోని అన్ని టీ షాపులు స్వచ్ఛందంగా మూసివేయడం జరిగింది. పాల ధర, చక్కెర, టీ పొడి ధరలు భారీగా పెరగడంతో టీ షాపుల నిర్వహణ భారంగా మారిందని చాయ్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధరల పెంపును వెంటనే నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ బంద్ కు పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ బంద్ లో మంథని పట్టణంలోని ప్రముఖ టీ షాపులు సిటీ టీ ప్యాలెస్, చిరు, లక్కీ టీ స్టాల్, ఉడిపి హోటల్ టీ స్టాల్, మొగిలి టీ స్టాల్ పలు షాపుల యజమానులందరూ పాల్గొన్నారు.



# లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో సాధించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవాలి
- యువశక్తి పోలీస్ కానిస్టేబుల్ ట్రైనింగ్ తరగతులను పరిశీలించిన కలెక్టర్

పెద్దపల్లి ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో పెద్దపల్లి జిల్లాకు చెందిన అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని రేకుర్తి సమీపంలోని కిమ్స్ పి.జి. కళాశాలలో పెద్దపల్లి జిల్లా అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న యువశక్తి పోలీస్ కానిస్టేబుల్ ట్రైనింగ్ తరగతులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి, శిక్షణ విధానం, బోధన, వసతి, భోజనం తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రతి అభ్యర్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో నిరంతరం శ్రమించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం కల్పిస్తున్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కాలంలో ప్రతి రోజును విలువైనదిగా భావించి, ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు.

చదువుతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని, పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా నిరంతరం సాధన చేయాలని తెలిపారు. "శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదవాలి. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవాలి. ప్రతి అభ్యర్థి ఉద్యోగం సాధించేలా కృషి చేయాలి" అని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులు, శిక్షణ నిర్వాహకులకు సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, బోధన తదితర అంశాల్లో నాణ్యతను పాటించాలని ఆదేశించారు. జూలై 27, 2026న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం మొత్తం 100 రోజుల పాటు కొనసాగనుంది. యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలకు అభ్యర్థులను సమర్థవంతంగా సన్నద్ధం చేయడమే శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం 100 మంది బాలికలు, 150 మంది బాలురు కలిపి మొత్తం 250 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎక్స్ సర్వీస్‌మెన్ ఎల్. మహిపాల్ రెడ్డి, శౌర్య డిఫెన్స్ అకాడమీ అధ్యాపకులు, కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికపై అంతప్పగూడలో గ్రామసభ



**వీబీజీఆర్ఏఎంజీ పనుల గుర్తింపుపై అధికారుల సమీక్ష**

శంకర్‌పల్లి ఆగస్టు 31 (వుదయం)

శంకర్‌పల్లి మండలం అంతప్పగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా మండలస్థాయి గ్రామసభను నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అధికారి వి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధికి అవసరమైన వివిధ పనులపై చర్చించారు. ముఖ్యంగా వీబీజీఆర్ఏఎంజీకి సంబంధించిన పనులను గుర్తించేందుకు గ్రామసభను నిర్వహించినట్లు ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలో పొందుపరిచే విధంగా అధికారులు ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత కలిగిన పనులను గుర్తించి, వాటిని సంబంధిత ప్రణాళికలో చేర్చి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే గ్రామసభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంతప్పగూడ గ్రామ సర్పంచ్ బీరయ్య, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏపీవో నాగభూషణం, గ్రామపంచాయతీ కార్యదర్శి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం చర్చించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో చేర్చాలని నిర్ణయించారు. గ్రామస్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. గ్రామసభలో ప్రజలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని

**ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్**

పెద్దపల్లి ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)



అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ బి శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలం కేంద్రానికి చెందిన రాజవ్వ తన ఇద్దరు కుమారులు తనను పోషించడం లేదని తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారిక రాస్తూ సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం దరఖాస్తు ఫార్వర్డ్ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన బి రజిత తను ఒకేషనల్ ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు ఔట్ సోర్సింగ్ ద్వారా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సొసైటీకి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట గ్రామానికి చెందిన పుల్లూరు పద్మ తనకు వచ్చే ఒంటరి మహిళల పెన్షన్ నిలిపివేశారని తనకు ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డిఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తనకు చెందిన 46 గంటల భూమి పోతుందని, కానీ 47 గుంటలు పోతున్నట్లు రికార్డులలో తప్పుగా నమోదు చేశారని , దీనిని సవరించి తన గుంట భూమి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# నల్లబెల్లి వెలమ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా దుగ్యాల చలపతిరావు

**అధ్యక్షులు కమిటీ సభ్యులను సన్మానించిన గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్**

వర్ధన్నపేట , ఆగస్టు 31 ( వుదయం ప్రతినిధి ):

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో వెలమ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా దుగ్యాల చలపతి రావు ప్రధాన కార్యదర్శిగా పలపాటి రామారావు, కమిటీ సభ్యులు ఎన్నికైన సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ నూతన ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అభివృద్ధి తోపాటు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మరియు పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బండ మోహన్ రావు , సంపత్ రావు, తక్కలపల్లి శ్రీధర్ రావు , దుగ్యాల దేవేందర్రావు , తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభను జయప్రదం చేయండి

**తెలంగాణ పూర్వ జేఏసీ నాయకుల విజ్ఞప్తి**

హనుమకొండ , ఆగస్టు 31 ( వుదయం జిల్లా ప్రతినిధి ):






తెలంగాణ ఉద్యమకారుడు, అమరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభ సెప్టెంబర్ 2న హనుమకొండ కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించబడుతున్నదని, నాటి ఉద్యమ సహచరులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అభిమానులు యాది సభలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ పూర్వ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో పెద్ది నిర్వహించిన పాత్ర మరువరానిదన్నారు. పోరాటాల పురిటి గడ్డ ఓరుగల్లు జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమాన్ని గ్రామ గ్రామానికి విస్తరింప చేసిన ఘనత పెద్దికే దక్కుతుందన్నారు. విద్యార్థి ,యువజన, రైతు , ఉద్యోగ - కార్మిక, కుల, ప్రజా సంఘాలను ఐక్యపరచి రాష్ట్రాన్ని సాధించే వరకు అకుంఠిత దీక్షతో కృషి చేశారన్నారు. వారి ఆకస్మిక మృతి ప్రచా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ సిహెచ్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పెద్ది నిబద్ధత కలిగిన నాయకుడని, అనేక కష్టాలను ఆటంకాలను ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన మహా నాయకుడన్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై పోరాటాలలో ముందుండి నడిపిన ఆయన మరణం మనందరిని కలచివేసిందన్నారు.టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన

కోసం జరిగిన పోరాటాలను ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమన్వయం చేయడంలో పెద్ది కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజల కోసం పోరాడిన నాయకులు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటారన్నారు. తెలంగాణ ఆకాంక్ష వేదిక నాయకులు ఎన్ . సూరన్న మాట్లాడుతూ తెలంగాణ మలిదశ పోరాటంలో పెద్ది సాహసోపేతమైన పాత్ర నిర్వహించి పెద్దన్నగా నిలిచాడన్నారు. రాష్ట్ర సాధన అనంతరం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్నా అప్పారావు మాట్లాడుతూ పెద్ది యాది సభలో రాజకీయాలకతీతంగా అన్ని ప్రజా సంఘాల నాయకులు, సహచర ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు డాక్టర్ సాధు రాజేష్ ,జై సింగ్ రాథోడ్ ,జోరిక రమేష్ ,మంద వీరస్వామి, డాక్టర్ సూత్రపు అనిల్ , భిక్షపతి నాయక్ ,డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ వలీవుల్లా ఖాద్రీ ,నీలం రాజ్ కిషోర్, డాక్టర్ సురాసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

# చిన్నశంకర్‌పల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

**మేరు సేవా సమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

శంకర్‌పల్లి ఆగస్టు 31 (వుదయం)



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో గల చిన్నశంకర్‌పల్లిలో వెలసిన పురాతన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారం మేరు సేవా సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ ఆంజనేయ స్వామివారికి అభిషేకం, నవగ్రహ అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది.శంకరదాసమయ్య మేరు సేవా సమితి అధ్యక్షుడు శీలంకోటి రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట రాజ్యం, ఎల్బీనగర్ ప్రెసిడెంట్ మునగాల రమేష్, శంకరదాసమయ్య వసతి గృహం యాదాద్రి జనరల్ సెక్రటరీ సింగు విష్ణు, రాష్ట్ర నాయకుడు మునగాల రాము, మేరు సంక్షేమ భవనం యాదాద్రి కోట్టూరి గణేష్, ఆర్కిటెక్చర్ కం ఇంజనీర్ సోన్నాకుల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి, కౌన్సిలర్ ఉష విజయ్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్వతగిరి పోలీస్ స్టేషన్ లో ఉత్తరాఖండ్ బిజెపి రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ పై ఫిర్యాదు

పర్వతగిరి ,ఆగస్టు 31 ( వుదయం ప్రతినిధి ):

రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ,వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఆదేశానుసారం,వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీ చిలువేరు శీనివాస్ పిలుపుమేరకు సోమవారం పర్వతగిరి పోలీస్ స్టేషన్లో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరుకుడు రవీందర్ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మరియు రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ పై పిటిషన్ ఇవ్వడం జరిగిందని ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరుకుడు రవీందర్ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హల్ద్వానీలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించిన అనంతరం, బీజేపీ - ఆర్ఎస్ఎస్ కు చెందిన కొందరు వ్యక్తులు ఆయన ప్రసంగించిన వేదికకు "శుద్ధీకరణ" చేశారు. ఈ "శుద్ధీకరణ" చర్య కేవలం అత్యంత ఖండనీయమైన, సిగ్గుచేటైన ఆలోచనకు ప్రతీక మాత్రమే కాదు, మన రాజ్యాంగాన్ని, ఎస్ /ఎస్ టీ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే కాకుండా, చట్టపరమైన నేరం కూడా. ఈ ఘటన జరిగి 20 రోజులు గడిచినా, గౌరవనీయ ప్రధానమంత్రి మోదీ గారు, ఆయన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రధానమంత్రి మోదీ కి నిజంగా మన దేశ రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే, ఉత్తరాఖండ్‌లో ఈ నేరానికి పాల్పడిన వారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయించి, ఎస్ సీ /ఎస్ టీ చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకునేలా చూడాలి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి గ్రామ సర్పంచ్ చీదురు శంకర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాసాని సుధాకర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లందాసు రంగయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బోట్ల కనకరాజు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు కందికట్ల భాస్కర్, అన్నారం సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేడ్ల సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, రావూరు ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో ఉపాధ్యాయుల పాత్రక చిరస్మరణీయం

- బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య
- ఘనంగా సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ

హైదరాబాద్, ఆగస్టు, 31:



సమాజ సేవలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమైనదన్నారు బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య. విద్యార్థులను సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేసేది కూడా టీచర్లేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుడు తరగతి గది నుంచి బయటకు వచ్చినా, విద్యార్థుల హృదయాల నుంచి ఎప్పటికీ బయటకు రాలేని వ్యక్తులన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని తాళ్లపల్లిలో జరిగిన జడ్‌పీహెచ్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూరం విష్ణువర్ధన్ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభకు బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్యాఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య.. ఉపాధ్యాయ వృత్తి ఒక ఉద్యోగం మాత్రమే కాదని, అది ఒక బాధ్యత, ఒక సేవ, ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తరమైన అవకాశమన్నారు. ఈ బాధ్యతను డాక్టర్ సూరం విష్ణువర్ధన్ రెడ్డి ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో, ప్రేమతో నిర్వర్తించారని కొనియాడారు. ఆయన పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే బోధించలేదని, జీవితంలో ఎలా ముందుకు సాగాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, మంచి మనిషిగా ఎలా ఎదగాలి అనే విలువలను కూడా తమ విద్యార్థులకు నేర్పిస్తారని గుర్తు చేశారు. వారి దగ్గర చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఈ రోజు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉండటం వారి సేవకు గొప్ప గుర్తింపన్నారు. ఈ రోజు వారు ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ చేస్తున్నప్పటికీ, ఉపాధ్యాయుడిగా వారి ప్రభావం మాత్రం ఎప్పటికీ పదవీ విరమణ చేయదని కొనియాడారు. వారు నాటిన జ్ఞానపు విత్తనాలు ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో ఎప్పటికీ ఫలాలను అందిస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఫాదర్ అగుస్తో కొలంబో 17వ వర్ధంతి

ధర్మసాగర్ ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)



ఈరోజు ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో ఫాదర్ అగుస్తో కొలంబో 17వ వర్ధంతి సందర్భంగా ఫాదర్ అగుస్తో కొలంబో జ్ఞాపకార్థ పూజ అనంతరం ఫాదర్ అగుస్తో కొలంబో ఇటలీలో జన్మించి ఇండియాకు వచ్చి ముఖ్యంగా వరంగల్ జిల్లా మన ఘనపూర్ నియోజకవర్గంలో వరంగల్ నేత్రాసనంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాలయాలు, ఆస్పటల్ కట్టించారు. కుష్టి వ్యాధులకు సేవ కార్యక్రమాలు, వికలాంగులకు, అనాధలకు, పేద ప్రజలకు విద్య, వైద్యము అందించి పేద ప్రజలకు ఇండ్లు కట్టించారు. జీవనోపాధికి వ్యవసాయానికి బావులను తొవ్వించారు. పేదల జీవనోపాధికి గేదెలను ఇచ్చారు. విద్యార్థులకు స్కాలర్షిప్లు మహిళలకు కుట్టు మిషన్లు కుట్టు అల్లికలు ఇలా అనేక ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫాదర్ అగుస్తో కొలంబో లేని లోటు ఎంతో ఉంది. కరుణాపురం లోని పెద్ద చర్చి ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భైరపాక ప్రభాకర్, ఫాదర్ పూదోట ప్రకాష్ ,ఫాదర్ మారేపల్లి ప్రవీణ్ , మునిగాల రాజు, గిన్నారపు రమేష్ ,ఏరువ భాస్కర్, నీరటి మల్లేష్, కందుకూరి శ్రీనివాస్, పొత్కమూరి రాజేష్, పోగుల యుగేందర్ ,ఏరువ సుగుణ, టి జ్యోతి తదితరులు నివాళులు లు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

# సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్‌లో పరకాల విద్యార్థుల సత్తా..

**పలు విభాగాల్లో బంగారు, వెండి పతకాల కైవసం**

**మాస్టర్ మాడ సంపత్**

పరకాల ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి):



టైగర్ పంచ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హుజురాబాద్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పరకాల క్రియేటివ్ కరాటే డో అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని అసోసియేషన్ వ్యవస్థాపకులు, బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్ మాడ సంపత్ తెలిపారు. బ్లాక్ బెల్ట్ స్పారింగ్ విభాగంలో బండి సాయి చరణ్ బంగారు పతకం సాధించారు. జూనియర్ బాలుర స్పారింగ్, కటా విభాగాల్లో కే. భరత్ బంగారు పతకాలు సాధించగా, స్పారింగ్ విభాగంలో యశ్వంత్, ఆరెళ్ల స్పారింగ్ విభాగంలో ఆకుల శ్రీ ప్రియాంష్ స్వర్ణ పతకాలు సాధించారు. సబ్ జూనియర్స్ స్పారింగ్ విభాగంలో పోవు దేవాన్ష్ బంగారు పతకం, తేలకుంట్ల జయవర్ధన్ వెండి పతకం సాధించారు. సబ్ జూనియర్స్ బాలుర కటా విభాగంలో మహమ్మద్ ముజీబ్ అష్రఫ్, జూనియర్ బాలికల కటా విభాగంలో నాళిక హారిక స్వర్ణ పతకాలు సాధించారు. విజేతలను క్లబ్ అధ్యక్షులు సోద రామకృష్ణ, కరాటే మాస్టర్లు బొట్ల స్వామి, రాజు, డాక్టర్ మాడ విశ్వశ్రీ, మాడ స్నిగ్ధిష్ అభినందించారు.

# ఎరువుల పంపిణీలో నూతన విధానం

- ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS)" యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ
- పర్వతగిరి మండల వ్యవసాయ అధికారి శశికాంత్

పర్వతగిరి , ఆగస్టు 31 ( వుదయం ప్రతినిధి ):



రైతులకు ఎరువులు పారదర్శకంగా, అవసరానికి అనుగుణంగా, సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (Framework for Fertilizer Sale - FFS)" అనే నూతన డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో భాగంగా మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా FFS యాప్ ద్వారానే నిర్వహించబడుతుందని పర్వతగిరి మండల వ్యవసాయ అధికారి.... తెలిపారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుంది.

**FFS యాప్‌లో రైతులు ఎలా నమోదు చేసుకోవాలి?**

రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా FFS యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి. ఫార్మర్ ఐడి ఉన్న రైతులు ఫార్మర్ ఐడి లేదా ఆధార్ సంఖ్య ద్వారా లాగిన్ అయ్యి, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతు భూమి వివరాలు స్వయంచాలకంగా యాప్‌లో అందుబాటులోకి వస్తాయి. ఫార్మర్ ఐడి లేని రైతులు ఆధార్ సంఖ్యతో ఈ - కేవైసీ పూర్తి చేసి, ఓటీపీ ధృవీకరణ అనంతరం నమోదు ప్రక్రియను కొనసాగించవచ్చు.

**భూమి వివరాలు కనిపించకపోతే ఏమి చేయాలి?**

కొంతమంది రైతుల భూమి వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీ లో అందుబాటులో లేకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో యాప్‌లో ఉన్న "సింక్ ల్యాండ్స్ విత్ ఫార్మర్ రిజిస్ట్రీ " సదుపాయాన్ని ఉపయోగించి భూమి వివరాలను సమకాలీకరించుకోవచ్చు అయినప్పటికీ భూమి వివరాలు అందుబాటులోకి రాకపోతే "ఆడ్ / క్లెయిమ్ ల్యాండ్ " ద్వారా భూమి వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఇందులో రైతులు తమ యాజమాన్య హోదా లేదా సాగుదారునిగా సంబంధించిన వివరాలను నమోదు చేసి భూమి వివరాలను సమర్పించవచ్చు.

**ఎరువుల బుకింగ్ – QR కోడ్ విధానం**

రైతులు తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసిన తర్వాత దరఖాస్తు సమర్పిస్తే, యాప్‌లో QR కోడ్ మరియు టోకెన్ నెంబర్ రూపొందుతుంది. ఆ QR కోడ్ ఆధారంగా రైతులు ఎరువులను పొందవచ్చు. రైతు స్వయంగా లేదా తాను అధీకరించిన వ్యక్తి ద్వారా కూడా ఎరువులు స్వీకరించే సౌకర్యం ఈ యాప్‌లో కల్పించబడింది.

**రైతులకు కలిగే ప్రయోజనాలు**

ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుంది.

# మండల స్థాయి ప్రజావాణికి 16 దరఖాస్తులు

**మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత**

ఖానాపురం, ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి):




మండల స్థాయి ప్రజావాణి మూడవ వారం కార్యక్రమానికి 16 దరఖాస్తులు వచ్చాయని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి మూడవ వారం కార్యక్రమానికి 16 దరఖాస్తులు వచ్చాయని తెలుపుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులతో కలిసి మండల లెవెల్ లోనే పరిష్కరించే సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలుపుతూ,

మండల స్థాయి అధికారుల పరిధి కానీ సమస్యలను మాత్రమే జిల్లా అధికారులకు పంపిస్తున్నట్లు తెలుపుతూ, ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల సహాయ సహకారాలు సంబంధిత సహాయకులు లబ్ధిదారులకు కావలసిన సమాచారాన్ని అందిస్తున్నారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి పోటెత్తిన ప్రజలు.. 18 అర్జీల స్వీకరణ

**భూ సమస్యలపైనే అత్యధిక ఫిర్యాదులు**

**మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు**

రాయపర్తి ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి):




మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలంటూ మొత్తం 18 దరఖాస్తులు అందజేశారు.అందిన దరఖాస్తుల్లో 10 భూ సంబంధిత సమస్యలు, 2 మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు సంబంధించిన సమస్యలు, 1 మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)కు సంబంధించిన సమస్య, ఇరిగేషన్ శాఖకు విద్యుత్ శాఖకు ,మిషన్ భగీరథకు , సంబంధించిన శాఖలకు ఒక్కొక్కటి, 2 ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాస్ లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.